మంగళవారం
6-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 224
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

హిందువులను బహిష్కరించండి

టొరంటో: కెనడాలో నివసిస్తున్న లక్షలాదిమంది హిందువులను భారత్‌కు పంపాలని ఖలిస్థాన్ మద్దతుదారులు డిమాండ్ చేశారు. టొరంటోలో హిందూ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బోనులో ఉంచిన మోదీ, అమిత్ షా, జైశంకర్ దిష్టిబొమ్మలను ప్రదర్శించారు. ఆదివారం టొరంటోలోని మాల్టన్ గురుద్వారాలో ఈ సంఘటన జరిగింది. కెనడాలోని వేలాది మంది ఖలిస్థానీ సానుభూతిపరులు ఈ హిందూ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు కెనడాలోని హిందూ సమాజం ఈ ర్యాలీని ఖండించింది. దీనికి సంబంధించిన ఈ వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

‘వక్ఫ్’పై విచారణ 15కి వాయిదా

న్యూదిల్లీ: వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను మే 15న తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనానికి సుప్రీంకోర్టు బదిలీ చేసింది. వక్ఫ్ సవరణ చట్టంపై పిల్‌లన్నింటినీ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనానికి జాబితా చేయనున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం పేర్కొన్నారు. జస్టిస్ సంజీవ్‌ఖన్నా

- మిగతా 2 లో

ఆధారాల్లేకుండా ఆరోపణలేంటి?

ఈడీ తీరుపై సుప్రీం ఆగ్రహం

న్యూదిల్లీ: ఆధారాలు చూపకుండా వ్యక్తులపై ఆరోపణలు చేయడం సబబు కాదని సుప్రీంకోర్టు...ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను మందలించింది. “మేము ఈడీ నుంచి అనేక ఫిర్యాదులను చూశాం. ఇదేం తీరు? దేనినీ ప్రస్తావించకుండా ఆరోపణలు చేస్తారా” అంటూ ఈడీని ప్రశ్నించింది. చత్తీస్‌గఢ్‌లో రూ. 2వేల కోట్ల మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడి బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ అభయ్ ఓకా ఈ మేరకు వ్యాఖ్యానించారు. ‘మీరు అతను రూ.40 కోట్లు సంపాదించాడని ఒక నిర్దిష్ట ఆరోపణ చేశారు. ఇప్పుడు మీరు ఈ వ్యక్తికి ఈ కంపెనీతో లేదా మరే ఇతర కంపెనీతో సంబంధం ఉందని చూపించలేకపోతున్నారు’ అని జస్టిస్ ఓకా అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) ఎస్వీ రాజుతో అన్నారు. ‘అతను ఈ కంపెనీలకు డైరెక్టర్ కాదా? అతను మెజారిటీ

- మిగతా 2 లో

ట్రంప్ సర్కారుతో అదానీ బేరసారాలు

- అమెరికా అధికారులతో మంతనాలు
- చివరి దశకు చర్చలు
- బ్లూమ్‌బెర్గ్ నివేదిక వెల్లడి

న్యూదిల్లీ: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికాలో ఉన్న 265 మిలియన్ డాలర్ల విదేశీ లంచం కేసును ఎత్తి వేయడానికి ఆయన బృందం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికార బృందంతో చర్చలు ప్రారంభిం చిందని ప్రముఖ వార్తా సంస్థ బ్లూమ్‌బెర్గ్ నివేదిక ద్వారా వెల్లడైంది. ప్రధాని నరేంద్ర మోదీకి దగ్గరగా ఉంటారని ఆరోపణలెదు ర్కొంటున్న అదానీ ట్రంప్ బృందంతో చర్చలు జరపడం కొత్త విషయం కాదని... ఈ సంవత్సరం ప్రారంభం నుండి కొనసాగు తున్నాయని బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. ఈ ఏడాది మార్చిలో న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లోని యూఎస్ అటార్నీ కార్యాలయం, న్యాయ శాఖతో సమావేశం జరిగిందని వార్తా సంస్థ పేర్కొంది. ‘ఈ సంవత్సరం ప్రారంభంలో మొదలైన చర్చలు ఇటీవలి వారాల్లో తీవ్రమయ్యాయి. ఇదే వేగం కొనసాగితే రాబోయే నెలలో లేదా అంతకన్నా ఎక్కువ కాలంలో ఒక

- మిగతా 2 లో

మోదీతో రాహుల్ భేటీ

న్యూదిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం సాయంత్రం ప్రధాని కార్యాలయానికి (పీఎంవో) వెళ్లారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేసేందుకు నిర్వహించిన భేటీలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సీబీఐ డైరెక్టర్ నియామక కమిటీ సమావేశానికి రాహుల్‌తో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా హాజరయ్యారు. ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్

- మిగతా 2 లో

రేపటి నుంచి బస్సులు బంద్

- ఆర్టీసీ జేఏసీ హెచ్చరిక
- రవాణామంత్రితో చర్చలు విఫలం
- సమ్మెకు సిద్ధమైన కార్మికులు
- వేలాదిమందితో కవాతు

విశాలాంధ్ర–హైదరాబాద్: ఆర్టీసీలో సమ్మె తప్పేలా కనిపించడం లేదు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు విఫలమవడంతో... బస్సుల నిలిపివేత తప్పదని ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సులు నిలిపివేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సమ్మె సన్నద్ధతలో భాగంగా సోమవారం హైదరాబాదులో భారీ ఎత్తున కార్మికులతో కవాతు నిర్వహించారు. ఆర్టీసీ కళాభవన్ నుంచి ప్రారంభమైన ఈ కవాతు బస్ భవన్ వరకు కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, విధిలేని పరిస్థితుల్లోనే సమ్మె నోటీసులు ఇచ్చామని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న వివరించారు. కాగా ఆర్టీసీ కార్మికుల కవాతు దృష్ట్యా ఆ ప్రాంతంలో పోలీసులను భారీగా మోహరించారు. కాగా రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం చర్చలకు సిద్ధమని ప్రకటించడంతో సోమవారం ఉదయం ఆయనను ఆర్టీసీ సంఘాల నేతలు కలిశారు. తమ సమస్యలను వివరించారు. సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావొచ్చన్న మంత్రి పొన్నం సమస్యలు వినడానికి సీఎం, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. అయితే సమ్మె చేసేందుకు ఇది సరైన సమయం కాదని మంత్రి వారికి వివరించారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, సమస్యలు తగ్గుతున్నాయన్న పొన్నం... కోలుకుంటున్న దశలో సమ్మె చేయొవద్దని ఆర్టీసీ జేఏసీ నేతలకు విజ్ఞప్తి చేశారు. సిబ్బంది సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్న మంత్రి, కొత్తగా ఒక్క బస్సు

- మిగతా 2 లో

సహకరించాల్సిన వారు సమరం అంటారా?

ఉద్యోగ సంఘాలపై సీఎం రేవంత్ ఫైర్

విశాలాంధ్ర–హైదరాబాద్: ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒకటో తేదీనే జీతభత్యాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారు? అని ఆయన ప్రశ్నించారు. తనను కోసినా సరే వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ప్రభుత్వం అంటే తాము ఒక్కరమే కాదన్న రేవంత్ రెడ్డి మనమంతా కలిస్తేనే ప్రభుత్వం అని అన్నారు. మనం పాలకులం కాదు సేవకులం అని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కష్టాల్లో

- మిగతా 2 లో

పాక్ ఆర్థిక మూలాలే లక్ష్యం

- శత్రు దేశానికి నిధులు ఇవ్వొద్దు: ఏడీబీకి భారత్ విజ్ఞప్తి
- కొనసాగుతున్న జల దిగ్బంధం...డ్యామ్‌ల మూసివేత
- రక్షణశాఖ కార్యదర్శితో ప్రధాని భేటీ

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా పాకిస్థాన్ భారత్ చడీ చప్పుడు లేకుండా అన్ని రకాల చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా శత్రుదేశం ఆర్థిక మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈక్రమంలోనే ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) అధ్యక్షుడు మసాతో కందాతో భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. ఉగ్రవాద కార్యకలాపాలకు కేంద్రంగా మారిన పాకిస్థాన్‌కు నిధుల కేటాయింపును తగ్గించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పాక్‌కు ఇచ్చే నిధులు ఉగ్రవాద సంస్థలకు నిధులు మళ్లుతున్న ఫలితంగా ఉగ్రవాదం వ్యాప్తి జరుగుతోందన్నారు. ఇటలీ ఆర్థిక మంత్రి గియాన్‌కార్లో జియోర్ గెట్టితో జరిగిన భేటీలోనూ ఇదే అంశాన్ని నిర్మలా సీతారామన్ ప్రస్తావించారని అధికార వర్గాలు తెలిపాయి. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) గ్రే లిస్టులో మళ్లీ పాక్‌ను చేర్చాలని ఆమె కోరారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్ ప్రస్తుతం ఏడీబీ, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి రోజులు వెళ్లదీస్తోంది. వివిధ రంగాల అభ్యున్నతి కోసమని చెబుతూ ఈ సంస్థల నుంచి పాకిస్థాన్ అప్పులు

- మిగతా 2 లో

మాక్ డ్రిల్స్ నిర్వహించండి

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్–పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతున్న వేళ రాష్ట్రాలకు కేంద్రం సోమవారం కీలక సూచనలు చేసింది. దేశ భద్రతలో పౌరులను సమాయత్తం చేసేందుకు బుధవారం (మే 7న) మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కొన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచించింది. భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించాలని, అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో తెలపాలని పేర్కొంది. శత్రు దాడి జరిగినప్పుడు విద్యార్థులు, యువకులు స్వీయరక్షణతో పాటు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన కల్పించాలని తెలిపింది. పాకిస్థాన్‌పై

- మిగతా 2 లో

వియత్నాం వీరోచిత పోరు స్ఫూర్తిదాయకం

పునరేకీకరణ 50వ వార్షికోత్సవాలకు హాజరుకావడం గర్వకారణం
ప్రతిధ్వనించిన శాంతి, ఐక్యత, అభివృద్ధి అంశాలు
ఆత్మీయసభలో ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వియత్నాంతో సరితూగగల పోరాటం ప్రపంచంలో ఎక్కడా జరగలేదని, ఆ దేశ వీరోచిత ఉద్యమం స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. నేడు ఏకైక కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వంగా అన్నింటా వియత్నాం విరాజిల్లుతోందని, విద్య, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో ఎంతో విశిష్టత సాధించిందని చెప్పారు. నాడు అగ్రరాజ్య అమెరికాను యుద్ధంలో తరిమికొట్టి... చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. దీంతోపాటు అమెరికా నగరాలకు దీటుగా వియత్నాం అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. వియత్నాం పునరేకీకరణ దినోత్సవాలు హోచిమిన్ నగరంలో అత్యంత ఘనంగా జరిగాయని, ఈ వేడుకల్లో సీపీఐ ప్రతినిధిగా వియత్నాం ప్రభుత్వ ఆహ్వానం మేరకు తాను హాజరుకావడం గర్వంగా ఉందన్నారు. రామకృష్ణ వియత్నాం పర్యటన విజయవంతంగా ముగించుకుని...రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా విజయవాడ దాసరి భవన్‌లో పార్టీ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ఆత్మీయసభ సోమవారం జరిగింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ, ప్రజాసంఘాల నేతలు వియత్నాం పోరాట పటిమను గుర్తుచేశారు. రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ జాతీయ కార్యదర్శివర్గం సమావేశమై... పార్టీ తరపున తనను వియత్నాం పంపిందన్నారు. తనకు విద్యార్థి దశ నుంచే ‘మేరా నామ్.. తేరా నామ్

- మిగతా 2 లో

బిగ్‌బాస్ షో నీచపు సంస్కృతి

నిర్వాహకులకు కోర్టు నోటీసులు: నారాయణ

విశాలాంధ్ర–తిరుపతి: ‘బిగ్‌బాస్ షో ముమ్మాటికీ అసాంఘిక చర్య, నీచపు సంస్కృతే. కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నా. కోర్టుకెళ్లాక మూడేళ్లకు బిగ్‌బాస్ నిర్వహకులకు నోటీసులు వెళ్లాయి’ అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిగ్‌బాస్ షో ద్వారా సమాజానికి హాని ఉందని, దీని ద్వారా నీచపు సంస్కృతికి ప్రజలు ఆకర్షితులై అనేక అవాంతరాలు ఏర్పడే ప్రమాదం ఉందని భావించి...తాను తొలి నుంచి పోరాటం చేస్తున్నానని నారాయణ చెప్పారు. తక్షణమే బిగ్‌బాస్ షో వంటి అసాంఘిక కార్యకలాపాలు నిలుపుదల చేయాలని దఫదఫాలుగా పోరాటాలు చేశామన్నారు. అయితే అప్పట్లో బిగ్‌బాస్ షోపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తీసుకోకపోగా... జిల్లా కోర్టులు సైతం తమ విన్నపాలు స్వీకరించలేదన్నారు. ఈ నేపథ్యంలో తాను స్వయంగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి బిగ్‌బాస్ షో వల్ల సమాజానికి కలిగే నష్టాన్ని, షో ద్వారా నిర్వాహకులు బాహ్యప్రపంచానికి ఇస్తున్న సందేశం ఫలితంగా అనేక ఇబ్బందులు కలుగుతాయని పేర్కొంటూ కేసు దాఖలు చేసినట్లు వివరించారు. మూడేళ్ల తరువాత కోర్టు నుంచి బిగ్‌బాస్ నిర్వాహకులకు, బాధ్యులకు నోటీసులు వెళ్లాయన్నారు. బిగ్‌బాస్ షో వల్ల సభ్యసమాజానికి ఎలాంటి సందేశం ఇవ్వదలచుకున్నారో వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణలో స్త్రీ అందాల పోటీలు నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రపంచంలోనే భారత సంస్కృతి అత్యున్నతమైనదని, స్త్రీని గౌరవించుకోవడంలో భారతీయులు ముందు వరుసలో ఉంటారన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత సంస్కృతిని అనుసరిస్తుంటే... పాశ్చాత్య సంస్కృతిని

- మిగతా 2 లో

వివిధ ప్రాంతాల్లో భూకంపం

ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల్లో భూమి కంపించింది. సోమవారం సాయంత్రం సమయంలో కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్, పెద్దపల్లి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భూమిలో ప్రకంపనలు జరిగాయి.

ఇదీ లోకం!

అయ్యో పాపం సంవత్సరం నుంచీ ఎదురు చూస్తున్నారా? ఇంకొన్ని రోజులు..

మార్క్సిజం ప్రపంచ మానవాళికి దిక్సూచి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో–కొత్తగూడెం : ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులను ఏకం చేసే సిద్ధాంతాన్ని రూపకల్పన చేసి, మానవ శ్రమకు విలువ చేకూర్చిన మహామేధావి కార్ల్‌మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్ల్‌మార్క్స్ 207వ జయంతిని పురస్కరించుకుని శేషగిరి భవన్‌లో సోమవారం కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మానవ శ్రమకు విలువ లేని పరిస్థితుల్లో శ్రామిక జీవులకు పని గంటలు, శ్రమకు తగిన వేతనం కోసం కార్ల్ మార్క్స్ చేసిన కృషి, త్యాగాలు ప్రపంచ కార్మిక వర్గానికి తోడ్పాటును అందించాయని తెలిపారు. సమాజ చరిత్ర అంతా వర్గపోరుతోనే ముడిపడి ఉంటుందని, ఈ వర్గపోరే అంతిమ విజయం సాధిస్తుందని చెప్పిన మహామేధావి, మానవతావాది మార్క్స్ అని కొనియాడారు. మార్క్సిజం ప్రపంచ మానవాళికి దిక్సూచి వంటిదన్నారు. అన్యాయం, దోపిడీ, అవినీతి నిర్మూలన జరగాలంటే మార్క్సిజానికి అనుగుణంగా ప్రజలు నడుచుకోవాలని సూచించారు. కమ్యూనిస్టు పార్టీలకు కాలం చెల్లిందని నిత్యం దుష్ప్రచారం చేసేవారికి చైనా విప్లవం సరైన సమాధానం చెప్పిందన్నారు. చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాలు సోషలిస్టు మార్గంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నాయని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు సిద్ధాంత కర్తగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మార్క్స్

- మిగతా 2 లో

పాక్‌లో మరో క్షిపణి ప్రయోగం

ఇస్లామాబాద్: భారత్ తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పాకిస్థాన్ రెండో క్షిపణి పరీక్షించింది. 120 కిలోమీటర్ల రేంజ్ 'ఫతా' క్షిపణిని ప్రయోగించింది. క్షిపణి పరీక్ష విజయవంతమైందని పాకిస్థాన్ మిలిటరీ మీడియా విభాగం వెల్లడించింది. దేశ రక్షణ, సైనిక కార్యకలాపాల దృష్ట్యా దళాలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయో తెలుసుకోవడం అత్యవసరమని, దానిలో భాగంగానే ఈ పరీక్షను విజయవంతంగా చేపట్టినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. అంతేకాకుండా, ఈ ప్రయోగం ద్వారా ముఖ్యమైన సాంకేతిక అంశాలను, వాటి పనితీరును పరిశీలించి, ధృవీకరించుకున్నట్లు పేర్కొన్నాయి. అయితే, ఈ ప్రయోగాన్ని ఎప్పుడు, ఎక్కడ నిర్వహించారు, ఏ రకమైన ఆయుధ వ్యవస్థను పరీక్షించారు వంటి నిర్దిష్ట వివరాలను మాత్రం పాక్ సైన్యం వెల్లడించలేదు. కేవలం తమ దళాల సంసిద్ధతను, సాంకేతిక సామర్థ్యాన్ని సమీక్షించుకునేందుకే ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు మాత్రమే పాకిస్థాన్ మిలిటరీ స్పష్టం చేసింది. ఇటీవలే పాక్ తొలి క్షిపణి పరీక్ష చేపట్టింది. తాజాగా సోమవారం మరో క్షిపణి పరీక్షను నిర్వహించింది.

మార్క్సిజం ప్రపంచ మానవాళికి దిక్సూచి

(మొదటిపేజీ తరువాయి)

అడుగుజాడల్లో నేటితరం కమ్యూనిస్టులు, యువతరం నడుచుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా కమ్యూనిజాన్ని మరింతగా విస్తరింపచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరిమి రాజ్ కుమార్, జిల్లా నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమారి, ఎస్.కె.ఫహీమ్, నూనావత్ గోవిందు, గుత్తుల శ్రీనివాస్, దారా శ్రీనివాస్, గొనె మని, సురేష్, లక్ష్మీనారాయణ ధనలక్ష్మి, దార లక్ష్మి, అక్తర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

బిగ్‌బాస్ షో నీచపు సంస్కృతి

(మొదటిపేజీ తరువాయి)

అనుసరించి హైదరాబాద్‌లో స్త్రీ అందాల పోటీలు నిర్వహించడం దౌర్భాగ్యమన్నారు. ఇకనైనా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన్ని తీసుకొచ్చి దేశ ప్రజలపై రుద్దకుండా సరైన విధానాలు నెలకొల్పడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు. బిగ్‌బాస్ నిర్వాహకులు కోర్టు నోటీసులకు సమాధానం ఇవ్వాలని ఆయన కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ తిరుపతి పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

కారల్ మార్క్స్ ఆశయాలు కొనసాగిద్దామని, యువతకు ఆయన స్ఫూర్తిదాయకమని నారాయణ అన్నారు. కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా సోమవారం తిరుపతి బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. మార్క్స్ గొప్పదనాన్ని, ఆయన పోరాటాలు, తెగువ గురించి నారాయణ వివరించారు. మార్క్స్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

అన్నదాత సుఖీభవకు గ్రీన్‌సిగ్నల్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రైతులు, కౌలు రౌతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వరుస వారీగా అమలు చేస్తోంది. మే నెలలో మరో రెండు పథకాలను నెరవేర్చేందుకు సిద్ధమైంది. అందులో ముఖ్యమైనది అన్నదాత సుఖీభవ పథకం. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున సాయం అందజేయనుంది. ఈ పథకం అమలుకు సంబంధించి వ్యవసాయ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది.

'వక్ఫ్'పై విచారణ 15కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

మే 13న సీజేఐగా పదవీ విరమణ చేయనున్నారు. ఈ అంశంపై వివరణాత్మక పరిశీలన అవసరమైనందున ఈ దశలో తాను ఎటువంటి తీర్పు లేదా ఉత్తర్వులు రిజర్వ్ చేయాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జస్టిస్ గవాయ్‌కు కొంత సమయం ఇవ్వాలని, మే 15కు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మే 5 వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో ఎలాంటి నియామకాలు చేయబోమని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనానికి కేంద్రం తెలిపింది.

మాక్ డ్రిల్స్ నిర్వహించండి

(మొదటిపేజీ తరువాయి)

భారత్ ప్రతీకార దాడులు చేయొచ్చనే అంచనాలు నెలకొన్న తరుణంలో కేంద్ర హోంశాఖ ఈ తరహా ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. పాక్ సైతం ప్రతిదాడికి దిగితే... అందుకు ముందుగానే రాష్ట్రాలను సిద్ధం చేస్తున్నట్లు కనబడుతోంది. శత్రు దేశం దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సన్నద్ధతా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొంది. ఎయిర్ రైడ్ హెచ్చరిక సైరెన్ల పనితీరును పరీక్షించాలని ఆదేశించింది. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో పౌరులకు తెలపాలని నిర్దేశించింది. పాకిస్థాన్ కవ్వింపు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, గుజరాత్, రాజస్థాన్‌తో పాటు జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు ఈ సూచనలు చేసినట్లు సమాచారం. ఆయా రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే సూచనలు చేసిన కేంద్రం... తాజాగా నెలకొన్న ఉద్రిక్తతలతో ప్రజల స్వీయ రక్షణలో భాగంగా మాక్ డ్రిల్స్ ద్వారా అవగాహన కల్పించడంపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. వైమానిక దాడులు జరిగితే... ఎలా వ్యవహరించాలి? సైరన్ ఇచ్చి ఎలా అప్రమత్తం చేయాలనే అంశంపై మాక్ డ్రిల్ చేయాలని పేర్కొంది.

మోదీతో రాహుల్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

పదవీకాలం మే 25న ముగియనున్న తరుణంలో కొత్త డైరెక్టర్ ఎంపికపై చర్చించినట్లు తెలుస్తోంది. మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల నియామక కమిటీలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సిఫారసు మేరకు కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ నియామకాన్ని చేపడుతుంది.

సినీ పరిశ్రమకు ట్రంప్ దెబ్బ

విదేశీ సినిమాలపై 100శాతం సుంకం

వాషింగ్టన్: అమెరికాలో విడుదల చేసే విదేశీ సినిమాలపై 100 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికన్ సినీ పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకున్నారు. విదేశీ సినిమాల వల్ల హాలీవుడ్ నష్టపోతోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా బయట షూటింగ్ చేసి తమ దేశంలో విడుదల చేసే అన్ని రకాల సినిమాలపై వంద శాతం పన్ను విధిస్తున్నట్లు ప్రకటించారు. అమెరికాలో సినీ పరిశ్రమ వేగంగా పతనమవుతోందని ఈ సందర్భంగా ట్రంప్ అన్నారు. ఇతర దేశాలు ఒక్కటై హాలీవుడ్‌ను నాశనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. దర్శక, నిర్మాతలు, స్టూడియోలను అమెరికా నుంచి దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని... ఇందుకోసం అన్ని రకాల ప్రోత్సహకాలు అందిస్తున్నాయన్నారు. ఈ కారణంగా హాలీవుడ్ నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. ఇది దేశ భద్రతకు ముప్పుగా అభివర్ణించారు. అందుకే విదేశాల్లో నిర్మించి అమెరికాలో విడుదల చేసే సినిమాలపై వంద శాతం సుంకం విధించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను వెంటనే ప్రారంభించేలా వాణిజ్య శాఖను ఆదేశిస్తున్నట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

భారత్-పాక్ మధ్య సయోధ్యకు ప్రయత్నం

ఇరాన్ మంత్రి అబ్బాస్ వెల్లడి

ఇస్లామాబాద్: భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు సమసిపోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆకాంక్షించారు. పాక్‌లో పర్యటిస్తున్న అబ్బాస్... 'భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం. పాకిస్థాన్‌లోని స్నేహితులతో చర్చిస్తాను. అలాగే అధ్యక్షుడు, ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రితో భేటీ అవుతా. మా ఇరుదేశాల మధ్య ఉన్న ప్రాంతీయ సమస్యలు, ద్వైపాక్షిక సంబంధాలు సమీక్షించుకుంటాం' అని తెలిపారు. ఇస్లామాబాద్‌లో చర్చల అనంతరం ఆయన ఈ వారం చివరిలో భారత్‌కు రానున్నారు. ఇది ఎప్పుడో నిర్ణయమైన పర్యటన. వాస్తవంగా విదేశాంగ మంత్రుల సమక్షంలో భారత్–ఇరాన్ జాయింట్ కమిషన్ సమావేశం కోసం ఆయన మన దేశంలో పర్యటించాల్సి ఉంది. అయితే అది వాయిదా పడటంతో మే 7–8 తేదీల్లో దానిని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాక్‌లకు మధ్యవర్తిత్వం చేయడానికి తాను సిద్ధమని గతంలోనూ ఆయన ప్రకటించారు.

కాగా, భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆదివారం పాక్ విదేశాంగ మంత్రి ఇషక్‌దార్‌కు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఫోన్ చేశారు. రెండు దేశాలు ఆసక్తి చూపితే.. ఉగ్రదాడితో తలెత్తిన రాజకీయ క్లిష్ట పరిస్థితులను పరిష్కరించే దిశగా సహకారం అందిస్తామని చెప్పారు. అలాగే పాక్ పీఎం షెహబాజ్ షరీఫ్‌తో మలేసియా పీఎం ఫోన్‌లో మాట్లాడారు. పాక్ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల గురించి అవగాహన ఉందని, సాధ్యమైనంత త్వరగా ఉద్రిక్తతలు చల్లారాలని ఆశాభావం వ్యక్తంచేశారు. హింస ఏ రూపంలో ఉన్నా ఖండించాలని, బాధ్యులను గుర్తించడానికి పారదర్శక దర్యాప్తు ఉండాలన్నారు.

ట్రంప్ సర్కారుతో అదానీ బేరసారాలు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారానికి దారితీయవచ్చునని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది' అని బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. ఈ నివేదిక ప్రకారం ఈ సంవత్సరం ప్రారంభం నుండి ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఈ వ్యాజ్యం చెల్లదని, దీనిని పునఃపరిశీలించాలని అదానీ బృందం వాదిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్‌లో భారతీయ విద్యుత్ సరఫరా ఒప్పందాలను పొందడానికి లంచాలు చెల్లించారని, నిధుల సమీకరణ సమయంలో అమెరికా పెట్టుబడిదారులను తప్పుదారి పట్టించారని అదానీ సహా ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై అమెరికా అధికారులు అభియోగాలు మోపారు.

అదానీ గ్రీన్ ఎనర్జీ బాండ్ ఆఫర్‌లో (750 మిలియన్ డాలర్లు) భారతీయ అధికారులకు మిలియన్ల కొద్దీ లంచాలు చెల్లించారని అదానీ సహా ఆయన మేనల్లుడిని ప్రశ్నించారు. గతేడాది, బ్రూక్లిన్‌లోని ఫెడరల్ ప్రాసిక్యూటర్లు.. అదానీ గ్రీన్ ఎనర్జీ విద్యుత్ కొనుగోలు చేయడానికి భారతీయ అధికారులకు లంచం ఇచ్చారని, కంపెనీ అవినీతి నిరోధక విధానాల గురించి అమెరికా పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. అయితే, అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను నిరాధారమైనవిగా కొట్టిపారేసింది. అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరిస్తామని ప్రకటించింది.

దూసుకుపోతున్న అదానీ షేర్లు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికార బృందంతో అదానీ బృందం చర్చలు జరుపుతోందన్న మీడియా కథనాల నేపథ్యంలో సోమవారం అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు ఒక్కసారిగా దూసుకుపోయాయి. చాలా రోజుల తర్వాత ఏకంగా 14 శాతం వరకు లాభాలు నమోదు చేశాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు 8.5 శాతం పెరగ్గా, అదానీ టోటల్ గ్యాస్ ఏకంగా 14 శాతం లాభపడింది. అదానీ పోర్ట్స్, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు కూడా 7 శాతం నుంచి 10 శాతం వరకు లాభాలను నమోదు చేశాయి. అంబుజా సిమెంట్స్, ఏసీసీ షేర్లు కూడా 3 శాతం వరకు పెరిగాయి.

పాక్ ఆర్థిక మూలాలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటోంది. 2024 జులైలో మూడేళ్ల కాల వ్యవధి కోసం రూ.59వేల కోట్ల (7 బిలియన్ డాలర్ల) రుణ ప్యాకేజీని పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ మంజూరు చేసింది. దీనిపైనా ఐఎంఎఫ్ ఎదుట ఆందోళన వ్యక్తం చేయాలని భారత సర్కారు యోచిస్తోంది. ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో మళ్లీ పాకిస్థాన్‌ను చేర్చాలని ఐరోపా దేశాలను బలంగా డిమాండ్ చేస్తోంది. అందుకు అనుకూలంగా నిర్ణయం వెలువడితే.. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం కలుగుతుంది. ఆ దేశం అంతర్జాతీయ సంబంధాలు దెబ్బతింటాయి.

- భారత్ ఇప్పటికే బాగ్‌లిహార్ ఆనకట్ట నీటిని ఆపేయగా... తాజాగా సలాల్ డ్యామ్‌ను కూడా మూసివేసింది. ఈ రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పూడికతీత పనులు చేపట్టింది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో దీనికి సంబంధించిన సమాచారం పాక్‌కు వెల్లడించలేదు. ఇదే సమయంలో జమ్మూకశ్మీర్‌లో నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బాగ్‌లిహార్ జలాశయం నుంచి నీటి సరఫరాను భారత్ నిలిపివేసింది. విద్యుదుత్పత్తికి ఉద్దేశించిన ప్రాజెక్టు నుంచి నీటిని వదలకపోవడం వల్ల పాక్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు సాగునీరు అందడం లేదు. ఉపగ్రహ చిత్రాలు దీనిని ధ్రువీకరిస్తున్నాయి. ఝీలం నదిపై ఉన్న కిషన్‌గంగ జలాశయం నుంచి కూడా నీటిని పాక్‌కు వెళ్లనివ్వకుండా అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది.
- ఇక పాకిస్థాన్ నుంచి దిగుమతులను భారత ప్రభుత్వం నిషేధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వ్యాపారులు పెద్ద ఎత్తున రాక్ సాల్ట్ ఆర్డర్స్‌ను రద్దు చేశారు. కొత్తగా పాక్‌కు ఆర్డర్ ఇవ్వడం ఆపేశారు. చాంబర్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌కు చెందిన అశోక్ లాల్వానీ మాట్లాడుతూ రాక్ సాల్ట్ (కల్లుప్పు) ఉప్పు, ఖర్జూరం, నల్ల ఎండుద్రాక్ష, సబ్జా సీడ్స్ పాకిస్తాన్ నుంచి దిగుమతి దిగుమతి చేసుకుంటున్నట్లు అంజూర పండ్లు, ఎండుద్రాక్షలు పాకిస్తాన్ ద్వారా అఫ్ఘనిస్తాన్‌కు చేరుకుంటాయన్నారు. ప్రతి నెలా 250 నుండి 300 టన్నుల రాక్ సాల్ట్, 550–600 టన్నుల ఖర్జూరం, 15 టన్నుల పిస్తా–నల్ల ఎండుద్రాక్ష, సబ్జా సీడ్స్ వ్యాపారం జరుగుతుందన్నారు. పాకిస్తాన్ నుండి దిగుమతులపై నిషేధం కారణంగా, టోకు వ్యాపారులు ప్రస్తుతానికి పెద్ద మొత్తంలో రాక్ సాల్ట్ ఆర్డర్‌లను రద్దు చేశారు.
- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ... 11 రోజులుగా ఎల్ఓసీ వెంబడి పాక్ సైన్యం దాడులకు పాల్పడుతుంది. శనివారం (మే 4న) రాత్రి కశ్మీర్ లోని కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరి, మెంధార్, నౌషేరా, సుందర్‌బాని, అఖ్నూర్ ప్రాంతాల్లో కాల్పులకు దిగింది. దీంతో అప్రమత్తమైన భారత సైనిక బలగాలు పాక్ కాల్పులను తిప్పికొట్టాయి.
- ప్రధాని మోదీతో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సోమవారం న్యూదిల్లీలో సమావేశమయ్యారు. ఆదివారం ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో.. అంతకు రోజు..అంటే శనివారం నావల్ చీఫ్ స్టాఫ్ దినేష్ కే త్రిపాఠితో ప్రధాని మోదీ వరుసగా సమావేశమయ్యారు. గత వారం ప్రధానితో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర దివ్వేది భేటీ అయ్యారు. ఇలా వరుసగా త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ భేటీ కావడం.. తాజాగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సైతం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకొంది.

వివిధ ప్రాంతాల్లో భూకంపం

రిక్టర్ స్కేలుపై తీవ్రత 3.8 | ఇళ్ల నుంచి పరుగులు తీసిన జనం

విశాలాంధ్ర–హైదరాబాద్: ఉత్తర తెలంగాణలోని వివిధ జిల్లాల్లో భూమి కంపించింది. సోమవారం సాయంత్రం సమయంలో కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్, పెద్దపల్లి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో భూమిలో ప్రకంపనలు జరిగాయి. సుమారు 2 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది. భూకంప లేఖినిపై తీవ్రత 3.8గా నమోదైంది. కరీంనగర్ జిల్లాలో చాలా చోట్ల స్వల్ప భూప్రకంపనలు జరిగాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా గంగాధర, చొప్పదండి, రామడుగు మండలాల్లో రెండు సెకన్ల పాటు ప్రకంపనలు జరిగాయి. దీంతో జిల్లా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. నిర్మల్ జిల్లాలో 2 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది. కడెం, జన్నారం, ఖానాపూర్, లక్ష్మణ్‌చాందా మండలాల్లో తీవ్రత ఉంది. అటు నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్ పల్లి ,మోర్తాడ్ మండలాల్లోనూ భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. పెద్దపల్లిలో సుల్తానాబాద్, సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలం రాజక్కపేటలోనూ భూప్రకంపనలతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. చాలాచోట్ల ప్రజలు ఉన్నపళంగా ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు.

రేపటి నుంచి బస్సులు బంద్

(మొదటిపేజీ తరువాయి)

కొనలేదని, ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగుల సీసీఎస్, పీఎఫ్ డబ్బులు కూడా వాడుకున్నారని పొన్నం వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు మొత్తం రూ.400 కోట్లు చెల్లించామన్న పొన్నం, దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రూ.1039 కోట్లు చెల్లించామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సీసీఎస్ బకాయిలు రూ.345 కోట్లు చెల్లించామని, 1500 మందికి కారుణ్య నియామకాలు పూర్తి చేశామన్నారు. ఆర్టీసీలో కొత్తగా 3వేల 38 మంది నియామకానికి అనుమతి ఇచ్చినట్లు కూడా పొన్నం తెలిపారు. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో జేఏసీ నేతలు సమ్మెకే మొగ్గుచూపుతున్నారు. మంగళవారం ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వస్తే తప్ప ఆర్టీసీలో సమ్మె జరగడం అనివార్యంగా కనబడుతోంది.

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యానికి ఆర్టీసీ జేఏసీ జనవరి 27న సమ్మె నోటీసు ఇచ్చిన సంగతి విదితమే. జేఏసీ నేతలు ఆర్టీసీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్‌కు సమ్మె నోటీసును అందజేశారు.

'పోలవరం'లో అంతర్జాతీయ నిపుణుల బృందం

విశాలాంధ్ర–పోలవరం: పోలవరం ప్రాజెక్టును సోమవారం అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించి... ఇక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్జర్, జియాన్‌రాఫాన్కో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. వీరితో పాటుగా పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జల సంఘం అధికారులు సరబ్జిత్ సింగ్ భక్షి, రాకేష్ తోతేజ, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి పోలవరం పనులను పరిశీలించారు. ప్రాజెక్టు సీఈ కె.నరసింహ మూర్తి, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర పనుల వివరాలను నిపుణుల బృందం, అధికారులకు వివరించారు. నిపుణుల బృందం సభ్యులు డయాఫ్రం వాల్ పనులు భూమి పటిష్టత జరుగుతున్న తీరు, ఎగువ కాఫర్ డ్యామ్ పటిష్టత పనులను పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి వచ్చిన నిపుణుల బృందం తొలుత జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

కృష్ణానది యాజమాన్య బోర్డుకు లేఖ

కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. సోమవారం నాటిత్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరు కాలేమని అందులో పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణులు వస్తున్నారని అందులో వివరించింది. ఈ నెల 10 తర్వాత త్రిసభ్య కమిటీ భేటీ ఏర్పాటు చేయాలని ఏపీ ఈఎన్‌సీ కోరారు. ఇకపై కృష్ణా బోర్డు సమావేశాలు విజయవాడలోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

సహకరించాల్సిన వారు సమరం అంటారా?

(మొదటిపేజీ తరువాయి)

ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా? అని ప్రశ్నించారు. సమస్య ఉంటే చర్చించుకుందామని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని విపక్ష పార్టీలు కుట్ర చేస్తున్నాయని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని విజ్ఞప్తి చేశారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుందని ఆయన అన్నారు. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదని రేవంత్ రెడ్డి అన్నారు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందన్న రేవంత్ రెడ్డి దీనికి స్వీయ నియంత్రణే పరిష్కారమన్నారు. 'ప్రభుత్వమనేది మన కుటుంబం. కుటుంబం పరువును బజారున మాత్రం పడేయొద్దు. ఇప్పుడు(ఇలాంటి సమయంలో) కావాల్సింది సమరం కాదు సమయస్ఫూర్తి, సంయమం. తెలంగాణ రాష్ట్రాన్ని మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి తెలంగాణను రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్దాం' అని అన్నారు.

ఆధారాల్లేకుండా ఆరోపణలేంటి?

(మొదటిపేజీ తరువాయి)

వాటాదారుడా? అతను మేనేజింగ్ డైరెక్టర్ కాదా అనేది మీరు పేర్కొనాలి. ఏదో ఒకటి ఉండాలి కదా' అని ప్రశ్నించారు. కాగా దీనిపై మంగళవారం వివరాలను సమర్పిస్తానని ఏఎస్జీ ధర్మాసనానికి హామీ ఇచ్చారు. 'ఒక వ్యక్తి ఒక కంపెనీని నియంత్రించాల్సిన అవసరం లేదు. ఆ కంపెనీతో అతనికి ఎలా సంబంధం ఉందో నేను ఆ స్టేట్‌మెంట్ల ద్వారా చూపిస్తాను' అని రాజు ధర్మాసనానికి తెలిపారు. మద్యం కుంభకోణానికి సంబంధించి చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ కుమారుడు చైతన్య బాఘెల్ నివాసంపై రెండు నెలల క్రితం ఈడీ దాడులు చేసింది. ఉన్నత స్థాయి రాష్ట్ర అధికారులు, వ్యక్తులు, రాజకీయ నాయకులు ఈ కుంభకోణానికి పాల్పడ్డారని, దీనిలో డిస్టిలర్ల నుండి దాదాపు రూ. 2,000 కోట్లు లంచంగా తీసుకున్నారని మరియు దేశీయ మద్యం పుస్తకాలను విక్రయించారని ఈడీ ఆరోపించింది. ఏప్రిల్ 29న, ఇదే విషయంలో జరిగిన మరో విచారణలో జస్టిస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏమందంటే... 'దర్యాప్తు దాని స్వంత వేగంతో సాగుతుంది. ఇది పూర్తయ్యే వరకు కొనసాగుతుంది. మూడు చార్జిషీట్లు దాఖలు చేశారు. మీరు ఆ వ్యక్తిని కస్టడీలో ఉంచడం ద్వారా వాస్తవంగా శిక్ష విధిస్తున్నారు. మీరు ఈ ప్రక్రియను శిక్షగా మార్చారు' అని పేర్కొంది.

వియత్నాం వీరోచిత పోరు స్ఫూర్తిదాయకం

(మొదటిపేజీ తరువాయి)

వియత్నాం..వియత్నాం' అనే నినాదం బలంగా మనస్సులో నాటుకుపోయిందని, ప్రపంచంలో సంపదగల, పేద, పెద్ద దేశాలున్నప్పటికీ... వాటిన్నికంటే ఇంత త్యాగం చేసిన వియత్నాం లాంటి దేశం మరొకటి లేదన్నారు. వియత్నాంలోని హోచిమిన్ సిటీలో జరిగిన వేడుకల్లో భాగంగా వివిధ దేశాల కమ్యూనిస్టు నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు హాజరయ్యారని గుర్తుచేశారు. ఈ వేడుకల్లో శాంతి, ఐక్యత, జాతీయ అభివృద్ధి అంశాలు ప్రధానంగా ప్రతిధ్వనించాయని విశ్లేషించారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి లామ్‌తోపాటు అక్కడి పార్టీ నేతలు తనను సాదరంగా ఆహ్వానించారన్నారు. ప్రపంచ శాంతి సంఘం అధ్యక్షులు పల్లవ్‌సేన్ గుప్తాతో కలిసి వార్ మ్యూజియాన్ని సందర్శించానని, వియత్నాం యుద్ధ సంఘటనలు ఎంతో అద్భుతంగా ప్రదర్శించారని తెలిపారు. అమెరికా వినియోగించిన రసాయనిక ఆయుధాల ఫొటోలు ఉంచారన్నారు. వియత్నాంలో నాడు 10 కోట్ల మంది జనాభా ఉన్నారని, ప్రపంచయుద్ధంలో అమెరికా 50 లక్షల టన్నులు, కొరియా యుద్ధంలో 26 లక్షల టన్నుల బాంబులు వినియోగించగా... ఒక్క వియత్నాం యుద్ధంలో ఏకంగా కోటి 43 లక్షల టన్నుల బాంబులను అత్యధికంగా ప్రయోగించిందని వివరించారు. ప్రపంచ యుద్ధం మూడేళ్లకు పైగా జరగగా, వియత్నాం యుద్ధం 17 ఏళ్ల 2 నెలలపాటు కొనసాగిందని చెప్పారు. వియత్నాం–అమెరికా మధ్య జరిగిన యుద్ధంలో 30 లక్షల మంది చనిపోయారని, 20 లక్షల మంది క్షతగాత్రులయ్యారని, 3 లక్షల మంది గల్లంతయ్యారని, మొత్తంగా 53 లక్షల మందిని యుద్ధం సర్వనాశనం చేసిందని రామకృష్ణ తెలిపారు. ఇందుకోసం 676 బిలియన్ డాలర్లను అమెరికా వెచ్చించిందని చెప్పారు. తాగేందుకు మంచినీరు లేని వియత్నాం...ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందిందని, అక్కడ యుద్ధం జరిగిందా? లేదా? అనే సందేహం కలుగుతోందన్నారు. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్, డల్లాస్ తదితర నగరాలకు ధీటుగా వియత్నాం రాజధాని హోచిమిన్ సిటీ అభివృద్ధి చెందిందని చెప్పారు. వియత్నాంలో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తారన్నారు. వియత్నాం నివేదికలో...'వియత్నాం దేశ ప్రజలు, కమ్యూనిస్టు పార్టీ, ప్రపంచవ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తుల మద్దతు, అమెరికాలోని మానవతా హృదయం గల మేధావులు...వాళ్లందరి సహకారంతో యుద్ధంలో విజేతలుగా నిలిచాం' అని ఉందని రామకృష్ణ వివరించారు. చైనా తరహాలోనే వియత్నాం అభివృద్ధి చెందిందన్నారు. 30 ఏళ్ల క్రితం దారిద్ర్యరేఖకు దిగువున (బీపీఎల్) 70 శాతం మంది ఉండగా...ప్రస్తుతం 1.9 శాతమే బీపీఎల్‌లో ఉన్నారని చెప్పారు. ఆ దేశంలో అందరూ చదువుకుంటున్నారని, సంస్కృతి, సంప్రదాయాలు గొప్పగా ఉన్నాయని, అక్కడ కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం తప్ప, మరే పార్టీ లేదన్నారు. వియత్నాం ప్రభుత్వ విధానాలను కమ్యూనిస్టులే కాకుండా, కమ్యూనిస్టేతరులూ కొనియాడతారని వివరించారు.

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదులపై సుదీర్ఘకాలం పోరాడిన అద్భుతమైన విప్లవగాథ వియత్నాం అని అన్నారు. వియత్నాం చారిత్రక వేడుకల్లో సీపీఐ నుంచి రామకృష్ణకు ఆహ్వానం రావడం మనకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు, కార్యదర్శివర్గ సభ్యులకు ఏపీ రాష్ట్ర సమితి తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం చీలిక తర్వాత మతోన్మాద శక్తులు మితిమీరిపోతున్నాయని, ఈ తరుణంలో హోచిమిన్ రాసిన వీలునామాను కమ్యూనిస్టులంతా చదవాలని సూచించారు. ప్రొగ్రెసివ్ ఫోరమ్ రాష్ట్ర నాయకులు అక్కినేని చంద్రరావు, కృష్ణాజిల్లా అధ్యక్షులు తాజారావు, విశ్రాంత ఆచార్యులు సి.నరసింహారావు, సాహితీ స్రవంతి నిర్వాహకులు దివికుమార్ తదితరులు నాటి వియత్నాంపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని వ్యతిరేకిస్తూ దేశంలోను, రాష్ట్రంలోను జరిగిన పోరాటాలను వివరించారు. అనంతరం రామకృష్ణను పార్టీ, ప్రజాసంఘాల నేతలు అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, బందెల నాసర్‌జీ, పార్టీ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ స్వాగతం పలకగా, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు ఆర్.పిచ్చయ్య, నజీర్ విప్లవ గేయాలు ఆలపించారు. దాసరి భవన్ ప్రధాన గేటు దగ్గర విజయవాడ నగర పార్టీ కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్వర్యంలో రామకృష్ణకు ఘనస్వాగతం పలికారు.

జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధికి బాటలు

కేంద్ర, జాతీయ రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

విశాలాంధ్ర - కొమురం భీం : జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధి బాటలు వేయడం జరుగుతుందని, రహదారుల అనుసంధానానికి మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని కేంద్ర రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. సోమవారం జిల్లాలోని కాగజ్ నగర్ ఎక్స్ రోడ్డు వద్ద మంచిర్యాల నుండి ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు వరకు 3 వేల 900 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 4 వరుసల జాతీయ రహదారిని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు గొడం నగేష్, గడ్డం వంశీకృష్ణ, ఉమ్మడి ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్, సిర్పూర్, ఆదిలాబాద్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబు, పాయల శంకర్, వెడ్మ బొజ్జు, రామారావు పటేల్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జాతీయ రహదారుల శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల శాఖ మంత్రి మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణతో అభివృద్ధికి బాటలు పడతాయని, రహదారుల అనుసంధానానికి మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆర్థికంగా, సామాజికంగా కొంత వెనుకబడి ఉందని, ఈ ప్రాంతంలో జాతీయ రహదారుల ఏర్పాటుతో పరిశ్రమలు రావడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.

జాతీయ రహదారుల అనుసంధానం ద్వారా పారిశ్రామిక అభివృద్ధి, రోడ్డు ప్రమాదాల నివారణ, తక్కువ సమయంలో సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలోని 32 జిల్లాల కేంద్రాల నుండి రాష్ట్ర రాజధానికి జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నామని, వచ్చే 3 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయిస్తామని అన్నారు. జిల్లా ఎస్.పి. డి.వి. శ్రీనివాస్ రావు, జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్. పి. ప్రభాకర్ రావు, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, ఆసిఫాబాద్ ఎ.ఎస్.పి. చిత్తరంజన్, కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి సుశాంత్ బొగాడే, జాతీయ రహదారుల సంస్థ అధికారులు శివశంకర్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే కఠిన చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లలో అనర్హులు రాకుండా మండల ప్రత్యేక అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జాబితాలో ఒక్క శాతం అనర్హులు ఉండరాదని, ఒకవేళ ఉన్నట్లయితే ఎమ్ ఎస్ ఓ మండల స్పెషల్ ఆఫీసర్‌దే పూర్తి బాధ్యత అని అన్నారు. ఎలాంటి అధికారిక, రాజకీయ వత్తిడులకు లోను కాకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని, రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు ఇవ్వడం ఒక గొప్ప విషయమని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ నెల 12న ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొనే పోటీదారులు నాగార్జునసాగర్ సమీపంలో ఉన్న బుద్ధవనాన్ని సందర్శిస్తున్న దృష్ట్యా బుద్ధవనం, విజయ విహార్‌ల వద్ద శానిటేషన్, లైటింగ్ ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారిని ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ అప్పటికప్పుడే కొన్ని పరిష్కరించగా, మరికొన్నిటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి పంపించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఇన్చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, డిఆర్డిఏ శేఖర్ రెడ్డి, నల్గొండ ఇన్చార్జి డిఆర్ఓ, ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, జిల్లా అధికారులు ప్రజావాణికి హాజరై ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్/ దంతాలపల్లి: రెవెన్యూ గ్రామసభల ద్వారా అర్జీలను స్వీకరించి నూతన చట్టం ప్రకారం భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తెలిపారు. సోమవారం జిల్లాలోని దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం, ఆగపేట, రాజవరం, మేఘతండా, దుబ్బతండా రెవెన్యూ గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తీరును పరిశీ లించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టం అమలులో భాగంగా 28 జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన జిల్లా నుండి దంతాలపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో, భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొనాలని, దరఖాస్తులు స్వీకరించి, నూతన చట్టం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు గ్రామంలోనే అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నెల రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, దంతలపల్లి తహసీల్దార్ యు.సునీల్ రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

విశాలాంధ్ర- తొర్రూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.అరుణ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలంటూ సోమవారం తొర్రూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ కళాశాలలో అందే సౌకర్యాలపై వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవమున్న అధ్యాపకులు విద్యార్థులకు బోధిస్తారని, బోధనలో నాణ్యతా ప్రమాణాలు ఉంటాయన్నారు. కళాశాలలో ఉచితంగా పుస్తకాలు ఇస్తారని, మిగతా రుసుములు ఏమీ ఉండవన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన అనేక మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. తొర్రూరు కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సిఈసి, హెచ్ఈసి, ఒకేషనల్ ఈటి, ఎలక్ట్రికల్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగల నారాయణ, అధ్యాపకులు మల్లయ్య, ఉప్పలయ్య, నరసయ్య, శివరామకృష్ణ, రాజేష్ కుమార్, నాగరాజు, కమల్‌దీప్ పాల్గొన్నారు.

సింగరేణి అర్జీ వన్‌లో జాబ్ మేళాకు సన్నాహం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు త్వరలో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించేందుకు సోమవారం ఆర్జీ వన్ జిఎం డి.లలిత్ కుమార్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళాలో హైదరాబాదుకు చెందిన వివిధ ప్రైవేటు కంపెనీలు పాల్గొని అర్హత కల నిరుద్యోగులకు వివిధ రకాల ఉద్యోగ అవకాశాలకు కల్పిస్తారని తెలిపారు. ఈ మేళా నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. వివరాలకు సెల్ నెం. 9491144252 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు గోపాల్ సింగ్, కిరణ్ బాబు, ఆంజనేయులు, ఆంజనేయ ప్రసాద్, వర ప్రసాద్, లక్ష్మి రాజం, ధనలక్ష్మి బాయి, రాజేష్ కుమార్, అశోక్‌రావు, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్స్ స్థలానికి ఇనుప కంచె ఏర్పాటు

విశాలాంధ్ర - కారేపల్లి : ఇటీవల కారేపల్లిలోని ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 38లో బీసీ హాస్టల్‌కు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ రూ.3 లక్షలు నిధులను జిల్లా పంచాయతీరాజ్ శాఖకు కేటాయించి హాస్టల్‌కు కేటాయించిన స్థలంలో ఇనుపకంచె ఏర్పాటు చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా అధికారులు ఇనుపకంచె ఏర్పాటు చేశారు. కంచె ఏర్పాటు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్ ముజ్మిల్ ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తురక నారాయణ, కెతిమాల శ్రీను, పాలిక ముత్తయ్య, తురక సాంబయ్య, పోతు వెంకటేశ్వర్లు, మణికొండ సత్యం తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం, అవయదానం చేసి ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర - వనపర్తి : ప్రజలకు అత్యవసరమైన సేవలలో ఒకటైన రక్తం ఇది ఒకరు తయారు చేసేది కాదు ఒకరూ ఇస్తేనే వస్తుంది అలాంటిది 49 సార్లు ఇచ్చి 49 మందిని రక్షించిన మురళీకృష్ణ సమాజానికి ఎంతో సేవ చేశాడని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ తెలిపారు. 49వ సారి రక్తదానం చేస్తున్న పిఇటి మురళీకృష్ణకు ఘనంగా సన్మానించారు. రక్తదానం చేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని కొత్త రక్తం వచ్చి మన ఆరోగ్యం బాగుపడుతుందని కనుక ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని ఆపదలో ఉన్న వ్యక్తులకు ఉపయోగపడి జీవితాంతం రుణపడి ఉంటారని, రక్తదానం చేయాలని మురళి కృష్ణుడు లాంటి వారిని ప్రోత్సహించి ఆపదలో ఉన్న ప్రజలను కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్‌తో పాటు మాజీ ఎంఇవో ధర్మారెడ్డి, రెడ్ క్రాస్ సభ్యులు అహ్మద్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గంధం నాగరాజు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, నాయకులు గౌనికాడి యాదయ్య, కురుమూర్తి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

విశాలాంధ్ర - కారేపల్లి : మావోయిస్టులను పూర్తిస్థాయిలో అంతం చేయాలనే లక్ష్యంతో అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనుల ప్రాణాలు తీసే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని నానునగర్ తండాలో పార్టీ సీనియర్ నాయకులు భూక్య బావ్ సింగ్ మూడో వర్ధంతి సభ పార్టీ మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టుల అంతం పేరుతో గిరిజనులను తమకు ప్రాణపదమైన అడవి నుంచి వెళ్ళగొట్టి అటవీ సంపదను ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని వ్యూహంలో భాగమే ఆపరేషన్ కగార్ అని విమర్శించారు. అటవీ హక్కుల చట్టాన్ని గిరిజనులకు ప్రత్యేకమైన 1/70 చట్టాన్ని కాలరాసే విధంగా నకిలీ గ్రామసభలు పెట్టి బెదిరించి పీసా చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనుల పట్ల మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారని మావోయిస్టుల సమస్యను సామాజిక సమస్యగా కాకుండా శాంతి భద్రతల సమస్యగా చూడటం దుర్మార్గమని దీనికి ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు జరపకపోగా లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నదనీ తాగు సాగు నీరు సమస్య కరెంటు రేషన్ కార్డులు అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ వర్ధంతి సభలో పార్టీ మండల కమిటీ సభ్యులు వల్లబోయిన కొండలరావు అజ్మీర శోభన్ బాబు, మన్యం బ్రహ్మయ్య, భీమ, భూక్య హరిచందర్, భూక్య సైదులు, రామ్ జీ.హర్జ, రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందులో గంజాయి పట్టివేత...

విశాలాంధ్ర - ఇల్లందు : మండల పరిధి లోని బొజ్జాయి గూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 111.754 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఇల్లందు డిఎస్పి చంద్రబాను వివరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం బొజ్జాయి గూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఆటోలో తరలిస్తున్న రూ. 55.87 లక్షల విలువ చేసే 111.754 కేజీల గంజాయిని ఒరిస్సా నుంచి జహీరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. జహీరాబాద్‌కు చెందిన రాజ్ కుమార్ రాథోడ్ ఆదేశాల మేరకు ఒరిస్సా నుంచి గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో కేసముద్రం చెందిన సపావత్ వెంకన్న, కామారెడ్డి జిల్లాకు చెందిన పిట్లం మండలం కోరంపల్లి తండా వాసి మూడు శ్రీనివాసును అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఆటో, మూడు సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం, జియో నెట్ రూటర్ సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ కేసులో ఇంకా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే చింతా సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణంలో తాగునీటి సరఫరా అంశంలో నెలకొన్న ఇబ్బందులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి ప్రజలకు మంచినీటిని అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పట్టణాల్లో వీధి దీపాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వీధి దీపాలు లేని చోట అమర్చాలని సూచించారు. వర్షకాలం దృష్టిలో ఉంచుకొని డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రజల వినతులను స్పందించి వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌవన్, డీఈఈ ఇంతి యాజ్, ఆర్.వెంకటేశ్వర్లు, జీవి శ్రీనివాస్, విఠల్, శ్రవణ్ రెడ్డి ఉన్నారు.

చెక్కు బౌన్స్ కేసులకు ప్రత్యేక లోక్ అదాలత్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, ఇతరులు వేసిన చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ వచ్చే నెల 9 నుండి 14 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5 నుండి 19 వరకు ముందస్తు లోక్ అదాలత్‌ను జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతు ప్రత్యేక లోక్ అదాలత్‌లలో ఇరువర్గాలు కానీ కేసులలో ఉన్న ఏ ఒక్క వ్యక్తి గానీ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించి కేసు రాజీ పరుచుకుంటామని తెలిపితే న్యాయ సేవా సంస్థ అందుకు సంబంధించిన కేసు వివరాలు తెలుసుకొంటారన్నారు. వారి కేసు ఏ కోర్టులో ఉన్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు తెప్పించుకొని అందులో ఉన్న ఇరవర్గాలని పిలిపించి ఇరువర్గాల సమక్షంలో గానీ వారి న్యాయవాదుల సమక్షంలో మధ్యవర్తిత్వం నిర్వహించి వారికి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. ప్రత్యేక లోక్ అదాలతులలో ఎవరైనా కక్షిదారులు డబ్బులు పూర్తిగా చెల్లించాటానికి సిద్ధంగా లేకపోయినట్లయితే కేసు వేసిన వ్యక్తిని ఒప్పించి కొన్ని వాయిదాలలో చెక్ అమౌంట్ చెల్లించేలా ఏర్పాటు చేసిన మధ్యవర్తులు కృషి చేస్తారన్నారు.

పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల విజ్ఞప్తులు ఆమె స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల అంశాలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని, శాఖలవారీగా పెండింగ్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా సిద్ధం చేయాలని, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన తక్షణమే పూర్తిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో అవసరమైన మరమ్మత్తులు చేపట్టి సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. అధికారులంతా సమయపాలన పాటించాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణిలో 91005 77132 నంబరుకు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలని, వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర - పెనుబల్లి : టేకులపల్లి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు ఈనెల 5 నుంచి 20 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టిబి రూపస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ప్రతి గ్రూపులో 40 సీట్ల చొప్పున ఖాళీలున్నాయని, టెన్త్ పాసైన విద్యార్థులు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హాస్టల్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ చేసుకోగలరు.

టెన్త్ పరీక్షల్లో ప్రతిభకనబర్చిన కానిస్టేబుల్ కుమార్తెకు సీఐ సన్మానం

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచల పట్టణంలో దివ్య హైస్కూల్ విద్యార్థిని బుష్రా తస్లీమ్‌కు 550/600 మార్కులతో జిల్లా టాప్పర్లలో ఒకరిగా నిలిచింది. ఇక్కడి స్థానిక పోలీస్టేషన్ కానిస్టేబుల్ పఠాన్ కూతురు అయిన తస్లీమ్‌ను పట్టణ సిఐ నాగరాజు సోమవారం సాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ నాగరాజు, మాట్లాడుతూ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో టాప్ ప్లేస్‌లో నిలిచి పోలీస్‌లకు పాఠశాలకు మంచి పేరు తెచ్చిందన్నారు. ఆమె చదువులకు అన్ని విధాలా సహకరించిన తల్లిదండ్రులకు, బోధనా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులందరికీ తమ శాఖ పరమైన శుభాశీస్సులు అందించారు. పరీక్షల్లో మెరిట్ మార్కులు చాటుతున్న విద్యార్థులకు సమాజం నుంచి కూడా ప్రోత్సాహం లభించాలన్నారు.

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషాను ఎన్నికున్నారు. కొత్తగూడెం హెూటల్ లేపాక్షిలో జరిగిన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో సాబీర్ పాషాను చిఫ్ ప్యాట్రన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జీ.యుగంధర్ రెడ్డి ప్రతిపాదించగా అన్ని క్రీడాసంఘాలు ఏకగ్రీవం ఆమోదించటం జరిగింది. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లడుతూ మన జిల్లాలో మంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారన్నారు. జిల్లాలో ఒక్క పెద్ద స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించుకోవాలని దానికి షుమారు 46 ఎకరాలు స్తలం అవసరము వుంటుందని చెప్పారు. దీనివల్ల అన్నిక్రిడలకు కోచ్‌లు, క్రీడాపరికరాల సాధనకు తనవంతు కృషి ఎప్పటికి ఉంటుందని సాబీర్ తెలిపారు. సాబీర్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జీ.యుగంధరెడ్డి, చైర్మన్ కె.మహిధర్, వైస్ ప్రెసిడెంట్ వై. వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి పి. కాశి హుస్సన్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ జాయంట్ సెక్రటరి బరిగెల భూపేష్ కుమార్, మట్టపర్తి రమేశ్, జిల్లా రెజ్లింగ్ గౌరవ అధ్యక్షులు నాగ సీతారాములు, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జాయంట్ సెక్రటరి డి.మల్లికార్జున,సినియర్ అథ్లెట్ ఎండీ బాబ్జి, చిఎఫ్ కోచ్ పి.నగేందర్, జిల్లా తైక్వాండోయ్ కార్యదర్శి ఈ.మొగిలి, జిల్లా కరాటే సెక్రటరి ఇంద్రాల శ్రీదర్, జిల్లా కేంద్రం షూటింగ్ సెక్రటరి ఎండీ అబ్దుల్ నబీ, బాస్కెట్బాల్ కోచ్ బాబు, జిల్లా టేబుల్ టెన్నిస్ జాయంట్ సెక్రటరి రియాజ్ పాల్గొన్నారు.

కోర్ట్ ఆర్డర్ ఉన్నా... కూల్చివేసిన ఫారెస్ట్ అధికారులు

విశాలాంధ్ర - ఇల్లందు : కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ తాము నివాసముండే రేకుల షెడ్డును ఫారెస్ట్ అధికారులు కూల్చి వేసినట్టు బాధితులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తమ ఇంటిముందు ఉన్న స్థలంలో తాజుద్దీన్ బాబాకు సంబంధించిన చిన్నదర్గాను ఏర్పాటు చేసుకొని నిత్యం పూజలు చేస్తూన్నట్లు ఎస్కే జావీద్, కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. దర్గా ఎదుట చిన్న రేకుల షెడ్డు నిర్మించుకోగా దాన్ని ఫారెస్ట్ అధికారులు రెండు రోజులు క్రితం కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ స్థలం ఫారెస్ట్ శాఖ సంబంధించిందని అధికారులు నిరాధార వాదనలు చేస్తున్నట్లు చెప్పారు. అయితే ఈ స్థలానికి సంబంధించి పూర్తి ఆధారాలు మా వద్ద ఉండటంతో కోర్టును కూడా ఆశ్రయించగా మాకు ఇంజక్షన్ ఆర్డర్ సైతం ఇచ్చారన్నారు. కోర్ట్ ఆర్డర్ ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు స్థానికుల చెప్పుడు మాటలు విని కొందరు వ్యక్తుల సహకారంతో ఈ కూల్చి వేతకు పాల్పడినట్లు ఆరోపించారు. మమ్మల్ని దూషించిన వారిపై పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేశామన్నారు. పోలీసు అధికారులు కోర్టును ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ దర్గాను చూసి ఓర్వలేక కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం భక్తుల కోసమేనని ఇందులో ఎలాంటి లాభంపేక్ష లేదని స్పష్టం చేశారు. స్థలానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలు మా వద్ద ఉన్నప్పటికీ ముస్లిం వ్యతిరేక శక్తులు, అధికారులు కూడా దర్గాపై కుట్ర పన్నుతున్నారన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జీసిసి మేనేజర్ దేవ్

విశాలాంధ్ర - గూడూరు: మండలంలోని మచ్చర్ల, చక్రుతండ, పొనుగోడు గ్రామాలలో సోమవారం జిసిసి కొనుగోలు సెంటర్లను మేనేజర్ జాటోత్ దేవ్ పరిశీలించారు. సోమవారం ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రంలో పరదర్శకత పాటించాలని ధాన్యాన్ని మ్యాచర్ వచ్చే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి సెంటర్లో రైతులు అమ్ముకోవాలని, ప్రభుత్వ అధికారులకు సహకరించాలని, పాలిథిన్ కవర్లను వినియోగించుకోవాలని తెలిపారు. అకాల వర్షానికి ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండాకాలంలో ఎక్కువసేపు కొనుగోలు సెంటర్లో ఎండలో ఉండకూడదని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ సుందర్ పాల్గొన్నారు.

వడదెబ్బతో మహిళా ఉపాధి కూలి మృతి

విశాలాంధ్ర-గార్ల : వడదెబ్బతో మహిళా మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అంబేద్కర్ బజారుకు చెందిన అక్కి పార్వతి (51) ఉపాధి హామీ కూలి పనులకు సోమవారం వెళ్లి వడదెబ్బకు గురైంది. దీంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పార్వతి మృతిపై ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్, తహసీల్దార్ శారద, ఎస్సైలు రియాజ్ పాషా, మహబూబి, ఆర్ఐ స్వప్న బృందం మృతదేహాన్ని సందర్శించారు. సదరు మహిళా మృతదేహాన్ని పరిశీలించి, మృతికి గల కారణాలు, వివరాలు అడిగి తెలుసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉండటంతో బయట కూలీలకు, ఉపాధి హామీ పనులకు వెళ్లే ప్రజలు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ విద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్ యాదవ్ సూచించారు.

సంపాదకీయం

ఎన్ఐఎ విప్పుతున్న చిక్కు ముడులు

పహల్గాంలో పాకిస్థాన్ ప్రోద్బలంతో తీవ్రవాదులు దాడి చేసి 15 రోజులు దాటినా భారత ప్రభుత్వం పాకిస్థాన్‌పై కఠిన చర్య తీసుకోకపోవడంతో దేశంలోని అనేక మంది ఆందోళన పడ్తున్నారు. ఈ ఆందోళన సహజమైందిగానే కనిపిస్తూ ఉండొచ్చు. అన్నింటికన్నా మించి తీవ్రవాదులను, వారిని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను "మట్టిగరిపిస్తాం" అని స్వయంగా ప్రధానమంత్రి చెప్పడం వల్ల దేశ వాసుల్లో కూడా ప్రతీకారేచ్ఛ విపరీతంగా పెరుగుతోంది. పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడం వేరు. యుద్ధానికి దిగడం వేరు. యుద్ధంవల్లే పాకిస్థాన్ లొంగేటట్టయితే ఇప్పటికే అనేక సార్లు భారత్ చేతిలో ఓడిపోయింది. అయినా పాకిస్థాన్ విధానం ఏమీ మారలేదు. ఎన్ని అపజయాలు ఎదురైనా పాకిస్థాన్ వైఖరి మారకపోవడానికి బలాబలాల అంశం కారణంగా కనిపించడం లేదు. పాకిస్థాన్ తన స్వశక్తి మీద ఆధారపడి ఆగడాలకు పాల్పడడం లేదు. అమెరికాతో సహా పశ్చిమ దేశాల ప్రత్యక్ష, పరోక్ష మద్దతు పాకిస్థాన్ తీవ్రవాదులకు మద్దతు ఇవ్వడానికి ప్రధాన కారణం. విదేశాల నుంచి వివిధ రూపాల్లో అందుతున్న సహాయాన్ని పాకిస్థాన్ భారత్ మీదికి తీవ్రవాదులను ఉసిగొల్పడానికి వినియోగిస్తోంది అన్నది పెద్ద రహస్యం ఏమీ కాదు. భౌగోళిక రాజకీయ అంశాల దృష్టితో చూస్తే పాకిస్థాన్ లాంటి దేశం మనకు పక్కలో బల్లెంలా ఉండడం అమెరికాకు అవసరం. ఇప్పుడు దానికి చైనా కూడా తోడైంది. చైనా నుంచి మనకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకునే శక్తి సామర్థ్యాలు మోదీ ప్రభుత్వంలో ఏ మాత్రం కనిపించడం లేదు. 2008లో బొంబాయి మారణకాండ తరవాత ఇలాంటి దురంతాలను ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కూడా పహల్గాం లాంటి దురంతాలను నిరోధించలేకపోతోంది. ఆ సంస్థ చేపట్టే దర్యాప్తు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. ఒక వేపు భారత వైమానిక దళం గంగా ఎక్స్‌ప్రెస్ వే పై విన్యాసాలు చేస్తోంది. తమ వైమానిక శక్తి ఎంత మహత్తరమైందో పాకిస్థాన్‌కు తెలియజెప్పడానికి ప్రయత్నిస్తోంది. భారత నౌకదళం కూడా సముద్రంలో విన్యాసాలు చేస్తోంది. భారత సైన్యం కూడా నైరుతి దళం రాజస్థాన్ ఉత్తర ప్రాంతంలో విన్యాసాలు చేస్తూనే ఉంది. ఇలాంటివన్నీ పాకిస్థాన్ మీద యుద్ధం చేసి తీరవలసిందేనని భావిస్తున్న భారతీయుల్లో దురాశకు ఆజ్యం పోస్తూ ఉండొచ్చు. కానీ రాజ్య వ్యవహారాలు ఇలాంటి జనాభిప్రాయం ఆధారంగా సాగవు. త్రివిధ దళాలకు తమ అనువైన సమయంలో, అనువైన రీతిలో ఎలాంటి చర్య తీసుకోవాలో నిర్ణయించుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం అని మోదీ ప్రభుత్వం చేసిన ప్రకటన జనాకర్షకమైంది అయితే కావొచ్చు కానీ వ్యూహాత్మకమైంది అయితే కాదు. మరో దేశం మీద ఏ చర్య తీసుకోవాలన్నా అది పౌర ప్రభుత్వమే తీసుకుంటుంది. విభిన్న విభాగాలు స్వతంత్రంగా తమ ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవడం రాజ్యతంత్రం కాదు. జాతీయ దర్యాప్తు సంస్థ పహల్గాం దాడి గురించి సమాచారం సేకరించడానికి ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే తొలి నివేదిక సిద్ధం చేసింది కూడా. నిజానికి ఎన్ఐఎ దర్యాప్తుకు ముందే కొన్ని అంశాలు అందరికీ తెలిసినవే. పహల్గాం ఘాతుకం పాకిస్థాన్‌లోని అనేక వ్యవస్థలు కలిసి చేసిన కుట్ర అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 370వ అధికరణం రద్దు తరవాత కశ్మీర్‌లో ఉగ్రవాదం వెనుకపట్టు పట్టింది అన్న మన ప్రభుత్వ వాదనలో పస లేదని పాకిస్థాన్ నిరూపించదలచుకుంది. పర్యాటకులు సందర్శించే సమయంలో ఏదో ఒక అవాంతరం సృష్టించి తీవ్రవాదం అస్తిత్వాన్ని నిరూపించడం పాక్ పన్నిన మరో కుట్ర. తద్వారా కశ్మీర్ సమస్య ఇంకా అపరిష్కృతమే అని చాటి చెప్పడం పాకిస్థాన్ వ్యూహం. కశ్మీర్ వ్యవహారంలో తమ పాత్ర అంతం కాలేదని చెప్పడం ఇంకో ప్రయత్నం.

ఈ కుట్ర నిజమేనని ఎన్ఐఎ నిర్ధారించింది. పహల్గాం ఘాతుకంలో ఐఎస్ఐ, లష్కరేతోయిబా, పాకిస్థాన్ సైన్యం జోక్యాన్ని కూడా ఎన్ఐఎ నిర్ధారించింది. ఈ ఘాతుకం వెనక ప్రధాన పాత్ర పాక్ సైన్యానిదేనన్నది ఎన్ఐఎ అభిప్రాయం. అయితే ఈ ఘాతుకం వెనక పాకిస్థాన్ ప్రభుత్వ హస్తం ఉందో లేదో, లేదా ఇది పాకిస్థాన్ సైన్యాధిపతి జనరల్ అసీం మునీర్ పాకిస్థాన్ ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా తీసుకున్న చర్యో ఇంకా నిర్ధారించవలసి ఉంటుంది. ఈ అనుమానం రావడానికి కారణం లేకపోలేదు. 1999లో కార్గిల్ మీద దాడి చేసినప్పుడు పాకిస్థాన్ సైన్యంలోని కొందరు అధికారులు తీసుకున్న దుస్సాహసిక నిర్ణయం మాత్రమే. సియాచిన్ హిమనదం నుంచి భారత్ తప్పుకునేట్టు చేయడానికి శ్రీనగర్-కార్గిల్-లేహ్ రోడ్ నుంచి భారత్ ను దూరం చేయాలనుకుని కొందరు పాక్ సైనికాధికార్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే వారి పథకం పారలేదు. పహల్గాం విషయంలోనూ పాక్ సైన్యాధిపతి జనరల్ అసీం మునీర్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్నారని ఎన్ఐఎ ప్రాథమిక అంచనాకు వచ్చింది. ఇటీవల పాకిస్థాన్‌లో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించడంతో పాకిస్థాన్ సైన్యం ప్రతిష్ట దెబ్బతిన్నది. ఇంకో వేపున అఫ్ఘానిస్థాన్ తాలిబన్ల నుంచి దురాండ్ లైన్ పొడవునా పాకిస్థాన్ ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. ఆ తరవాతే తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్ ధైర్యం పెరిగింది. 2023 మే 9వ తేదీన అదుపు తప్పిన పౌరుల గుంపు సైనిక కమాండర్ నివాసం మీద దాడి చేయడం కూడా పాక్ సైన్యం బలహీనతను బహిర్గతం చేసింది. ఇలాంటి దాడి పాకిస్థాన్ సైన్యం ఆధిపత్యానికి విఘాతమే. అవమానకరమైన ఈ సంఘటనల వల్ల మూట కట్టుకున్న అపఖ్యాతిని తుడిపేసుకోవడానికి ఆసిం మునీర్ పహల్గాం ఘాతుకానికి కుట్ర పన్ని ఉండొచ్చు. పహల్గాంలో తీవ్రవాదులు దాడి చేయడానికి అనుమతించే ముందు మునీర్ రాజకీయ నాయకత్వ అనుమతి తీసుకున్నట్టు లేదు. ఈ దాడి జరిగితే, దానికి భారత్ ప్రతీకారానికి పూనుకుంటే తమ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం తప్ప గత్యంతరం లేదు అని మునీర్ భావించి ఉంటారు. పాకిస్థాన్ మద్దతు ఉన్న తీవ్రవాద బృందాలు అంతర్జాతీయంగా తీవ్రవాదులు అనుసరించే విధానాలను పరిశీలిస్తూ తమ వ్యూహాలకు పదును పెట్టుకుంటారు. పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు శ్రీనగర్ ప్రాంతంలోనూ దాడి చేసి ఉండొచ్చు. కానీ ఈ ప్రాంతాలలో భారీ బందోబస్తు ఉంటుంది. అందుకే సరైన భద్రత లేని పహల్గాంలో అమాయక ప్రజల మీద దాడికి పాల్పడింది. గుల్మార్గ్‌లో కూడా పర్యాటకులు ఎక్కువగానే ఉంటారు. అయితే అక్కడ భద్రత భారీగా ఉంటుంది. తీవ్రవాదులకు ఉండే వ్యూహాలు పకడ్బందీగానే ఉంటాయి. పహల్గాంలో పర్యాటకులను ఆహ్వానించి తగిన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం మాత్రం కేంద్ర ప్రభుత్వ హ్రస్వదృష్టే. భద్రతా లోపమే. దీనికి బాధ్యులైన వారిని బోనెక్కించడం మోదీ హయాంలో సాధ్యమయ్యేదే కాదు.

గొట్టం గాళ్లు

చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

తిరగాల్సిన తిరుగుళ్లన్నీ తిరిగేసి, దొరికిందేదో నమిలేసి పశువులైతేనేం పక్షులైతేనం గూళ్లకు చేరుకునే టైం అవడంతో, తనూ ఇంటిదారి పట్టింది డాగీ. ఎంతెంత దూరం ఇంకెంత దూరం తోక ఊపుతూ పోతూ ఉంటే కాసింత దూరం' అని పాడుకుంటూ వచ్చి అరుగెక్కిన డాగీకి అక్కడ గోడకు ఆనుకుని మొండి తోక ఊపుతూ కనపడాల్సిన శాల్తీ కనపడలేదు. క్యాహువా? వాట్ హేపెండ్? ఏమైనదేమైనదని త్రిభాషా సూత్రం పాటిస్తూ మనసులోనే అనుకుంటూ నిలబడ్డ డాగీకి లోపలి గదిలోనుంచి ఏదో అలికిడి వినిపించింది.

నో డవుట్! సందేహం లేదు! లోపల ఎవడో దురాక్రమణదారుడు జొరబడ్డాడు. అసలు ఇలాంటి పాడుబడిన మొండిగోడల కొంపలోకి ఎవరు జొరబడతారు. జేబులు కొట్టేసినోళ్లు వాటాలు పంచుకోడానికీ, బైరాగులు గంజాయి దమ్ము కొట్టుకోడానికి వచ్చే ఛాన్సు ఉంటుంది. వచ్చిన వాడెవడైతే మనకేంకాని మన తక్షణ కర్తవ్యమేమిటి? పెద్ద పెట్టున అరుస్తూ ఉంటుంది కాని కరువుదులే అనుకుని అవతలివాడు కదలకుండా ఉండి పోతేనో అనుకుంది డాగీ. అరవకుండానే వెళ్లి దొరికిన పిక్కపట్టేసుకుందామంటే ఆ వైపున ఉన్న శత్రువు గుండె బలం, కండబలం తెలీకుండా ముందుకు ఉరకడం న్యాయంగా ఉంటుందా ఉండదా అని లోలోపల తర్కించి వితర్కించి, ఈ కాలంలో యుద్ధం చెయ్యడంకంటే చేస్తామని బెదరగొట్టడమే సజావైనపని. నోటితో జడిపించాలి కాని చేయి ఎత్తకూడదు. అరిచి గీ పెట్టాలి, భయపెట్టాలి అనుకుంది డాగీ.

ఒక్క పెట్టున నాన్‌స్టాప్‌గా అరుస్తూ లోపలికి ఉరికింది డాగీ. అక్కడ దొంగోడెవడూ కనిపించలేదు. గంజాయి పొగలో బైరాగి దర్శనమూ కాలేదు. గదిలో కలయతిరుగుతూ కనిపించింది డాంకీ. ఓర్నీ అనుకున్న డాగీ ఏంటి బ్రో నువ్వేనా ఇంకెవరో అనుకుని అటాకిద్దామనుకున్నా. అరిచి చంపేద్దామనుకున్నా అంది డాగీ. నీ ముఖం! తాటాకు చప్పుళ్లకూ, కంట్రీ డాగ్‌ల భౌభౌలకూ భయపడే బాడీ కాదిది అంది డాంకీ. అది సరేగానీ నాకంటే ముందస్తుగా వచ్చి అరుగుమీద కూచోకుండా గదలో కాలుకాలిన పిల్లిలా సారీ గాడిదలా పచార్లు చేస్తున్నావేం? అదా! అదీ! అది మన ఇద్దరి 'సేఫ్టీ' కోసమే. అరుగుమీద ఉంటే మనకు ఏదైనా ప్రమాదం ముంచుకు వస్తే, లోపల ఇక్కడ మనకు రక్షణ ఉంటుందా అని చూస్తున్నా అంది డాంకీ. మనకి ప్రమాదమా? మనకెవరు ఏం చెయ్యబోతున్నారు అంది అర్థంకాక డాగీ. అందుకే అంటా నమిలిన ఎముకే మళ్లీ మళ్లీ నమిలి దవడ నెప్పులు తెచ్చుకోకపోతే, రోజూ సాయంత్రం నేను నమిలిన దినపత్రికల వార్తలు వినవచ్చుగదా అంది డాంకీ. రోజూ టైం ప్రకారం నువ్వు నమిలి ఊసే చెత్తంతా వినే ఓపిక నాకు లేదు కానీ సుత్తి లేకుండా సూటిగా విషయం చెప్పరాదూ అంది డాగీ. లోకంలో ఏం జరగబోతున్నదో చూడు. యుద్ధం జరగబోతున్నది రెండు దేశాల మధ్య విధ్వంసం జరగబోతున్నది. మామూలు మనుషుల బ్రతుకులు చెల్లా చెదరవబోతున్నవి. ఎవరి సేఫ్టీ వారు చూసుకోవాలి కదా. మన ఈ లోపలి గది ఎక్కడ్నించో మనిల్ని రక్షించగలదా అని సర్వే చేస్తున్నాను. మనుషుల్లా నవ్వలేదు కదా నోరు తెరిచి పళ్లు బైటపెట్టి నాలుక వేలాడేసింది డాగీ. యుద్ధమా! జరుగున ంటావా? జరిగిందే అనుకో ఆ కొసానించి ఈ పాత కొంపదాకా రాఫెల్సూ, మిస్సైల్సూ ఎగిరి వచ్చేస్తయంటావా? వచ్చేసినయే అనుకో ఈ కొంప 'బంకర్' అయి మన ప్రాణాలకి గ్యారంటీ ఇస్తుందంటావా అంది డాగీ.

యుద్ధం జరగదంటావా! చూడు ఆకాశంలోయుద్ధ మేఘాలు ఎలాగ కమ్ముకొస్తున్నాయో అంది డాంకీ. యుద్ధ మేఘాలా ఈ గదిలోంచి ఎలా కనపడ్తయి చేసిన సర్వే చాలుకాని బైటకి పోదాం కనపడ్తయి. యుద్ధ మేఘాలో, వర్షపుమేఘాలో అంటూ గదిలోంచి బైటకు నడిచింది డాగీ, ఫాలో అయింది డాంకీ. అప్పటికే అరుగు మీద వచ్చి కూచున్న అబ్బాయి ఆ రెంటినీ చూసి ఇద్దరూ లోపలే ఉన్నారా? ఎక్కడికి వెళ్లారా అని చూస్తున్నా అన్నాడు. అది కాదన్నాయ్యా అటు చూడు నీలం రంగు చద్దరు మీద దూదికొండలు కనపడ్తున్నవికదా ఆకాశంలో. ఈ డాంకీ ఏమో యుద్ధమేఘాలు అంటున్నది అంది డాగీ.

ఓహో! ఇద్దరూ లోపల చేరి యుద్ధతంత్రం చేస్తున్నారా? మీదాకా నాదాకా రాదులే. ఉగ్రవాదులు నశించాలి ఉగ్రవాదం లేకుండా పోవాలి, అందరమూ అదే కోరుకుందాం. అది రెండు దేశాల మధ్య పోరై ఆ తర్వాత ప్రపంచ దేశాలకు పాకాలని ఎవరూ కోరుకోవద్దు. నేరస్తులు శిక్షింపబడాలి కాని అమాయకులు అగచాట్లు పడవద్దు. ఆ పనేదో జరుగుతుంది కాని అదిచేస్తాం ఇదిచేస్తాం మట్టిగరిపిస్తాం నాల్రోజుల్లో భూస్థాపితం చేస్తాం అని ప్రతిజ్ఞలు చెయ్యడం అవసరమా. అసలు ఎక్కడ ఏమి జరుగతున్నదో కాని అడ్డమైన అబద్ధాలతో, చిలవలు పలవలతో, కారుకూతలవంటి 'థంబ్ నెయిల్స్'తో గొట్టం గాళ్లు పండుగ చేసుకుంటున్నారు. జనం తలలో చేతులు పెట్టి మెదళ్లు గిల్లుకు తింటున్నారు. అక్కడెక్కడో వీళ్ల నోళ్లు మూయించారట. ఇక్కడ మన దేశంలో కూడా డబ్బుకోసం గడ్డి తినే గొట్టంగాళ్ల నోళ్లు మూయిస్తే బాగుండును అన్నాడు అబ్బాయి. గొట్టం గాళ్లెవరన్నా అంది అమాయకంగా డాగీ. యూట్యూబ్‌లని విన్లేదూ అవే అబద్ధపు అభూతకల్పనల గొట్టాలు. ఆ గొట్టాలతోనే ఊదర గొట్టేవాళ్లే గొట్టం గాళ్లు అంది డాంకీ.

కృష్ణాజలాల హక్కుల పరిరక్షణకు ఏపీ చర్యలేవీ...!

టి. లక్ష్మీనారాయణ

కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ - 2 (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్) 2010 డిసెంబరులో కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అటుపై తుది నివేదికను 2013లో అందజేసింది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో చివరనున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆ అవార్డు శరాఘాతంగా పరిణమిస్తుందని తీవ్ర ఆందోళన చెంది సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై సుప్రీం కోర్టు "స్టే" విధించి, విచారణ కొనసాగిస్తున్నది. ఏళ్లు గడిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యపై చర్చించడానికి కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి సమావేశాన్ని కేంద్ర జలశక్తి మంత్రి ఈ నెల 7న ఏర్పాటు చేశారు.

ఈ పూర్వరంగంలో కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి, జలవనరుల శాఖా మంత్రి డీకే శివకుమార్ ఉన్నత స్థాయి సమావేశాన్ని గత వారాంతంలో నిర్వహించి, తక్షణం కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ - 2 అవార్డును నోటిఫై చేయాలని కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడానికి కార్యాచరణను రూపొందించుకున్నట్లు ప్రసార మాధ్యమాల్లో ప్రముఖంగా వార్తలొచ్చాయి. కృష్ణాజలాల వివాద ట్రిబ్యునల్ - 2 అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు వేచి ఉండకుండా, ఎగువ కృష్ణా ప్రాజెక్టు -3 కింద ఆల్మట్టి డ్యాం ఎత్తును 524.256 మీటర్లకు పెంచాలనుకుంటున్నట్లు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించారు. ఇది అత్యంత ప్రమాదకరమైనది. ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును పెంచడం ద్వారా విజయపుర, కల్బుర్గి, రాయచూర్, యాద్గిర్, గడగ్, కొప్పల్ జిల్లాల్లోని 14.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని భావిస్తున్నట్లు కూడా సిద్ధరామయ్య తెలిపారు.

కొంప ముంచిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్: బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ హేతుబద్ధం కాని కొలమానాలతో నీటిని లెక్కగట్టి, పంపకాలు చేసింది. బచావత్ ట్రిబ్యునల్ 1894-95 నీటి సంవత్సరం నుండి 1971-72 వరకు అందుబాటులో ఉన్న 78 సంవత్సరాల నదీ ప్రవాహ గణాంకాలను పరిగణలోకి తీసుకొని 75% ప్రామాణికంగా 2,060 టీఎంసీ నికర జలాలు, వాటికి తోడు 70 టీఎంసీల పునరుత్పత్తి నీరు లభిస్తుందని నిర్ధారించి, మొత్తం లభ్యమయ్యే 2,130 టీఎంసీ నీటిలో మహారాష్ట్రకు 585 (560 నికర జలాలు 25 పునరుత్పత్తి జలాలు) టీఎంసీలు, కర్నాటకకు 734(700 నికర జలాలు, 34 పునరుత్పత్తి జలాలు) టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 811 (800 నికర జలాలు, 11 పునరుత్పత్తి జలాలు) టీఎంసీలు కేటాయించింది.

కానీ, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 112 సంవత్సరాల నదీ ప్రవాహ గణాంకాలున్నప్పటికీ 1961-62 మొదలు 2007-08 వరకు 47 సంవత్సరాల నదీ ప్రవాహ గణాంకాలను మాత్రమే పరిగణలోకి తీసుకొని 65శాతం విశ్వసనీయత ఆధారంగా నికరజలాలు 2,293 టీఎంసీలు

కర్నాటక రాష్ట్రం ఆల్మట్టి డ్యాం ఎత్తును 524.256 మీటర్లకు పెంచుకుంటే ఎలాంటి దుస్థితి ఎదురౌతుందో! ఈ కోవకే చెందిన ఎగువ భద్ర ఎత్తిపోతల ప్రాజెక్టును మోదీ ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా కొన్ని సంవత్సరాల క్రితమే గుర్తించి, వార్షిక బడ్జెట్‌లో రు.5,300 కోట్లు కూడా కేటాయించింది.

లభిస్తాయని నిర్ధారించింది. అలాగే, 75శాతం విశ్వసనీయతపై 2,173 టీఎంసీలు లభిస్తాయని, బచావత్ ట్రిబ్యునల్ పేర్కొన్న నికరజలాలు 2060, 70 పునరుత్పత్తి నీరు కలిపితే 2,130 టియంసిలకు ఇవి సరిసమానంగా ఉన్నాయని పేర్కొన్నది. కాబట్టి, బచావత్ ట్రిబ్యునల్ చేసిన నికరజలాల కేటాయింపును యదాథదంగా కొనసాగిస్తూ, మిగిలిన 163 (2293-2130) టీఎంసీలను మూడు (మహారాష్ట్ర, కర్నాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్) రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుల వారిగా కేటాయించింది. మహారాష్ట్రకు 43 టీఎంసీలను, కర్నాటకకు 61 టీఎంసీలను, ఆంధ్రప్రదేశ్ కు 43 టీఎంసీలను, నదీ ప్రవాహానికి 16 (మహారాష్ట్ర 3, కర్నాటక 7, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 6) టీఎంసీలు కేటాయించింది. అక్కడితో ఆగకుండా వార్షిక సగటు నీటి లభ్యత 2,578 టీఎంసీలుగా నిర్ధారించి, 65శాతం విశ్వసనీయతపై పేర్కొన్న 2,293 టీఎంసీలు పోను మిగిలిన 285 టీఎంసీ మిగులు జలాలు లభిస్తాయని, వాటిలో మహారాష్ట్రకు 35 టీఎంసీ, కర్నాటకకు 105 టీఎంసీలను, ఆంధ్రప్రదేశ్ కు 145 టీఎంసీలను ప్రాజెక్టుల వారిగా కేటాయించడం ద్వారా కేంద్ర జల సంఘం నుంచి అనుమతులు పొంది ప్రాజెక్టులను నిర్మించుకోవడానికి మార్గాన్ని సుగమం చేసింది. పైపెచ్చు, మిగులు జలాలను కూడా పంపిణీ చేస్తున్నాం కాబట్టి ప్రాజెక్టుల నిర్మాణానికి ఇక మీదట నికర లేదా మిగులు జలాలన్న తేడా ఉండదని సెలవిచ్చింది. మొత్తంగా మహారాష్ట్రకు 666 (585o43o3o35) టియంసిలు, కర్నాటకకు 907(734+61+7+105) టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ కు 1005(811+43+6+145) టీఎంసీలు కేటాయించింది. ఆ కేటాయింపుల ప్రకారం మహారాష్ట్ర , కర్నాటక రాష్ట్రాలు ప్రాజెక్టులను నిర్మిస్తే ఇక దిగువనున్న మన రాష్ట్రానికి నీళ్లొచ్చే అవకాశాలు మృగ్యం.

ఆల్మట్టి ఎత్తు పెంపునకు అనుమతిస్తే!: కర్నాటకకు ఎగువ కృష్ణా ప్రాంతంలో 130 టీఎంసీ మేరకు కేటాయింపులు పెంచి, వాటిని నిల్వ చేసుకొనే అవకాశం కూడా కల్పించాలని పేర్కొంటూ ఆల్మట్టి డ్యాం ఎత్తును 524.256 మీటర్లకు పెంచడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 173 నుంచి 303 టీఎంసీలకు పెంచుతూ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఆమోదించింది. గతంలో సుప్రీంకోర్టు అనుమతించిన 519.6 మీటర్ల ఎత్తుతోనే ఆల్మట్టి డ్యాం నిర్మాణం తరువాత మన రాష్ట్రానికి వరదలు వచ్చినప్పుడు అనివార్యమైతే తప్ప, నీటిని విడుదల చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన 800 టీఎంసీలలో 463 టీఎంసీలతో పాటు మద్రాసుకు తాగు నీటి కోసం 10 టీఎంసీ (మహారాష్ట్ర, కర్నాటక వాటా) కనీస నదీ ప్రవాహం వెరసి దాదాపు 500 టీఎంసీల నీరు ప్రతి ఏడాది కర్నాటక నుంచి తెలుగు రాష్ట్రాల్లోకి అనివార్యంగా ప్రవహించాలి. కర్నాటక రాష్ట్రం ఆల్మట్టి డ్యాం ఎత్తును 524.256 మీటర్లకు పెంచుకుంటే ఎలాంటి దుస్థితి ఎదురౌతుందో! ఈ కోవకే చెందిన ఎగువ భద్ర ఎత్తిపోతల ప్రాజెక్టును మోదీ ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా కొన్ని సంవత్సరాల క్రితమే గుర్తించి, వార్షిక బడ్జెట్ లో రు.5,300 కోట్లు కూడా కేటాయించింది.

కృష్ణా నది జలాలకు సంబంధించి ఎగువనున్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జలవనరుల శాఖా మంత్రులు, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధతో, రాజకీయ సంకల్పంతో కృషిచేస్తున్నారు. కృష్ణా జలాలపై బచావత్ ట్రిబ్యునల్ కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తున్నదా! అనేది తెలియాల్సివుంది.

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక
విజయవాడ

రష్యన్ కమ్యూనిస్టుల ముందున్న సవాళ్లు !

ఎం కోటేశ్వరరావు

ప్రకృతి ఉన్నంత వరకు ఎర్ర పూలు పూస్తూనే ఉంటాయి. దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులు ఉద్భవిస్తూనే ఉంటారు. వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎర్రపూల చెట్లు దెబ్బతిన్నట్లే కమ్యూనిస్టులూ అంతే. ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటుంది. మారిన పరిస్థితులను బట్టి కమ్యూనిస్టులూ మారాలి అంటే దానర్థం మౌలిక లక్షణాన్ని వదులుకోవాలని కాదు, ఎత్తుగడలు, వ్యూహాలను మార్చుకోవాలి.అనేక దేశాల్లో కమ్యూనిస్టులు స్థానికంగా ఉన్న పరిస్థితులను బట్టి సమస్యలను ఎదుర్కొంటున్నమాట నిజం. ఉద్యమాలు నల్లేరు మీద బండిలా సాగటం లేదు. ఉదాహరణకు రష్యన్ కమ్యూనిస్టులను చూద్దాం. ఒక వైపు ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం పేరుతో సామ్రాజ్యవాదులు ముందుకు తెచ్చిన ముప్పు, మరోవైపు దానికి వ్యతిరేకంగా గట్టిగా నిలిచిన బూర్జువావర్గ ప్రతినిధి పుతిన్ నాయకత్వంలో కార్మికవర్గాన్ని దోపిడీ చేస్తున్న అల్పజనపాలన. యుద్ధంతో ముందుకు వచ్చిన ఆర్థిక సమస్యలు, జాతీయవాదం. కమ్యూనిస్టులకు ఇది కత్తిమీద సాము.

ఓల్గాగ్రాడ్ విమానాశ్రయానికి స్టాలిన్ పేరు !

కమ్యూనిస్టులకు గాక ఏ ఎండకా ఆ గొడుగు పట్టే వారికి ఎందుకు వస్తాయి కష్టాలు. హిట్లర్ మూకలకు గోరీ కట్టిన ఓల్గాగ్రాడ్‌కు నాడు సోవియట్‌ను నడిపించిన ఉక్కుమనిషి స్టాలిన్ స్మారకంగా స్టాలిన్ గ్రాడ్ అని పేరు పెట్టారు. సోవియట్ పతనం తరువాత తిరిగి పూర్వనామాన్ని తెచ్చారు. ఫాసిజం, నాజీలపై విజయం సాధించి 2025 మే 9న 80వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఆ నగరానికి తిరిగి స్టాలిన్ పేరు పెట్టాలని రష్యన్ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు అలెగ్జాండర్ జెమిలియానిచెంకో, అగ్రనేత గెనడీ జుగనోవ్ దేశ అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌ను కోరారు. ఉక్రెయిన్ మీద యుద్ధం చేస్తున్న సైనికులకు మానవతాపూర్వక సాయంగా డ్రోన్లు, మోటారు సైకిళ్లను పంపిన సందర్భంగా జుగునోవ్ స్టాలిన్ గ్రాడ్‌లో ఉన్నాడు. తానెప్పుడూ ఆ నగరాన్ని అలాగే పిలుస్తానని, యావత్ దేశం అలాగే అంటున్నదని అన్నాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న వారి గౌరవార్థం గత వారం పుతిన్ పర్యటన సందర్భంగా ఓల్గాగ్రాడ్ విమానాశ్రయానికి స్టాలిన్‌గ్రాడ్ అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరును ప్రకటించాడు. అందువలన నగరం మొత్తానికి ఆ పేరు పెట్టాలని జుగనోవ్ అన్నాడు. గతంలో కొన్ని సంస్థలు స్టాలిన్ గ్రాడ్ అని తిరిగి పెట్టాలా లేదా అన్న సర్వే చేస్తే ఓల్గాగ్రాడ్ పౌరులు వ్యతిరేకించినట్లు తేలిందని చెప్పారు, నిజంగా అప్పుడు జనం అలా ఉన్నారా లేక పాలకులకు అనుగుణంగా సర్వేను చేశారా అన్నది చెప్పటం కష్టం. ఇప్పుడు పుతిన్ స్వయంగా విమానాశ్రయం పేరు మార్చాడంటే జనాల్లో వ్యతిరేకత లేదన్నది స్పష్టం ఎందుకు అంటే ఫాసిస్టు వ్యతిరేక పోరాటానికి మారు పేరు స్టాలిన్, ఆ పేరును ఉచ్చరించకుండా దాని గురించి చెప్పలేరు.

అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక వేదిక రెండవ సమావేశం గత నెలాఖరులో మాస్కోలో జరిగింది. ప్రపంచమంతటా ఫాసిజం తిరిగి తలెత్తుతున్న పూర్వరంగంలో దాన్ని ఎలా ఎదుర్కోవాలా అని 91దేశాల నుంచి హాజరైన 164 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్కో కమ్యూనిస్టు నాయకురాలు తాతిన్యా దెశియాతోవా మాట్లాడుతూ పాలకులు తమ సంపదలను పెంచుకోవటం తప్ప చేసిందేమీ లేదన్నారు. కాబట్టి ఇప్పుడు మేము గతంలో కీర్తి గాంచిన కట్టడాలన్నింటినీ శుభ్రం చేస్తున్నాం, పాత సోవియట్ చిహ్నాలను పెడుతున్నాం, పాత పాటలను పాడుతున్నాం, గత విజయాల గురించి చెబుతున్నాం అని చెప్పారు. మూడవ తరానికి చెందిన కమ్యూనిస్టు అయిన ఆమె అమెరికా పత్రిక పీపుల్స్ వరల్డ్‌తో మాట్లాడినప్పుడు ఈ వ్యాఖ్యలు చేశారు. నిజానికి ఫాసిస్టు వ్యతిరేక వారసత్వం రష్యన్ పౌరులది తప్ప పుతిన్ లేదా అతగాడు ప్రాతినిధ్యం వహిస్తున్న పెట్టుబడిదారీ విధాన పాలకులది కాదు. బోరిస్ ఎల్సిన్ వినాశకర, ప్రజల సంపద లూటీ పాలనతో పోలిస్తే పుతిన్ పాలనలో ఆర్థిక పరిస్థితి కాస్త మెరుగైంది, అది ఎంతో కాలం నిలిచేట్లు కనిపించటం లేదని ఆమె చెప్పింది. యుద్ధం, సంబంధిత అంశాల్లో సోవియట్ పాత్ర, దాని గురించి జనంలో ఉన్న జ్ఞాపకాల గురించి పుతిన్ గ్రహించాడు గనుకనే గత కొద్ది సంవత్సరాలుగా వాటిలో కొన్నింటిని ఎంచుకొంటున్నాడు. విమానాశ్రయానికి స్టాలిన్ పేరు పెట్టటం దానిలో భాగమే. రెండవ ప్రపంచ యుద్ధ విజయం 80వ వార్షికోత్సం సందర్భంగా నాటి బ్యానర్లు, చిహ్నాలతో మాస్కోను అలంకరించారు.

సోవియట్‌ను కూల్చివేసి మూడున్నర దశాబ్దాలు కావస్తున్నది, ఆ సమయంలో తెలిసీ తెలియని వయస్సులో ఉన్నవారికీ, తరువాత పుట్టిన వారికి గతం గురించి తెలియదు. వర్తమానంలో బతుకు ఎలా సాగించాలా అన్నది తప్ప ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించే తీరిక కూడా ఉండటం లేదు. పరిస్థితి ఉన్నది ఉన్నట్లుగా ఉంటే చాలన్నట్లుగా కొందరి ఆలోచన ఉంది. అయితే 2022లో ప్రారంభమైన ఉక్రెయిన్‌పై మిలిటరీ చర్య తరువాత పరిస్థితిలో మార్పు ప్రారంభమైంది. సామ్రాజ్యవాదుల కుటిల యత్నాలు, వారికి మద్దతు ఇస్తున్న పాలకులు రష్యా సరిహద్దులోని తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాలలో రష్యన్ జాతి పౌరులను అణచివేస్తున్న తీరుతెన్నులను గ్రహించిన కమ్యూనిస్టు పార్టీ యుద్ధ ప్రయత్నాలకు మద్దతు ఇచ్చింది. మూడు సంవత్సరాలు గడిచింది, వేలాది మంది మరణించారు, ఆర్థికంగా దేశం సమస్యలను ఎదుర్కొంటున్నది, మిలిటరీ చర్య ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. ఇలాంటి తరుణంలో ఏ వైఖరి తీసుకోవాలన్నది కమ్యూనిస్టులకు పెద్ద సమస్య. ఉక్రెయిన్ పోరులో రెండు లక్షణాలు ఉన్నాయి, ఒకటి సామ్రాజ్యవాద పోరు, రెండవది జాతీయ అంశం. నాటో కూటమి నాయకత్వంలోని సామ్రాజ్యవాదులు, రష్యాలోని పెట్టుబడిదారులకు ప్రాతినిధ్యం వహించే శక్తుల మధ్య ఈ యుద్ధం నడుస్తున్నది.అయితే ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని రష్యన్ జాతి పౌరులు అక్కడి నాజీలచేతిలో అణచివేతను ఎదుర్కొంటున్నారు. వారికి కమ్యూనిస్టులు, ఇతర వామపక్ష శక్తులు నాయకత్వం వహిస్తున్నాయి. రష్యన్ మిలిటరీ ఆప్రాంతంలోకి వెళ్లిన తరువాత పోరాడుతున్న ఆ శక్తులు ఎన్నికలలో పాల్గొనేందుకు పుతిన్ అనుమతించటం లేదనే వార్తలు వచ్చాయి. ఈ సమస్య ఉన్నప్పటికీ ఉక్రెయిన్‌ను నాజీకరణ కావించకుండా చూడటం, నాటో విస్తరణను అడ్డుకోవటం, అణచివేతకు గురవుతున్నవారిని రక్షించటం మౌలిక అంశాలుగా ఉన్నట్లు అనేక మంది భావిస్తున్నారు. అయితే కమ్యూనిస్టులకు పుతిన్ మీద, పాలకవర్గం మీద ఎలాంటి భ్రమలు లేవు. పాలకవర్గంలో ఉన్న విభేదాలు, వైరుధ్యాల కారణంగా గతంలో ప్రైవేటీకరించిన 10.8బిలియన్ డాలర్ల విలువగల కంపెనీలను గత మూడు సంవత్సరాలలో పుతిన్ సర్కార్ జాతీయం చేసింది. అయితే వాటిని ప్రజల ఆస్తిగానే ఉంచుతారా లేక తిరిగి తమకు అనుకూలమైన వారికి కట్టబెడతారా అన్న సందేహాలు ఉన్నాయి. ప్రైవేటీకరణను తీవ్రంగావిస్తామని పాలకపార్టీ నేతలు మార్చి నెలలో ప్రకటించారు. దాన్ని అడ్డుకొనేందుకు కమ్యూనిస్టులు సిద్ధం అవుతున్నారు.

పాక్ ఆర్థిక వ్యవస్థకే దెబ్బ

మూడీస్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగితే అవి... పాక్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరించింది. ఈ మొత్తం వ్యవహారంలో భారత్‌తో పోల్చుకంటే పాక్ తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషించింది. వృద్ధి రేటు మందగించడం, నిధుల సేకరణకు పాక్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందులు తలెత్తుతాయని వెల్లడించింది. పాక్‌కు బయటి అప్పుల లభ్యత పరిమితమైపోవడంతోపాటు ఆ దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరిగిపోతాయని మూడీస్ హెచ్చరించింది. ఇప్పుడు విదేశీ అప్పుల చెల్లింపులకు అవి సరిపోని పరిస్థితి నెలకొన్నట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల్లోనూ పాక్ ఐఎంఎఫ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉండటంతోపాటు స్థిరమైన వృద్ధిరేటు నమోదు చేస్తుందని వెల్లడించింది. దీనికి తోడు నాణ్యమైన ప్రభుత్వ వ్యయాలు, ప్రజల వినిమయ శక్తి చెప్పుకోదగిన స్థాయిలోనే ఉంటుందన్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతల ప్రభావం అతి స్వల్పంగానే ఉంటుందన్నారు. 'భారత ఆర్థిక కార్యకలాపాల్లో పెద్దగా ఇబ్బందులు ఏమీ ఉంటాయని అనుకోము. ఎందుకంటే దానికి పాక్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు అతి తక్కువ. దాని మొత్తం ఎగుమతుల్లో ఇస్లామాబాద్‌కు వెళ్లేవి 0.5 శాతం మాత్రమే. ఇక మా జియోపొలిటికల్ అంచనా ప్రకారం భారత్-పాక్ మధ్య పరిమిత స్థాయిలోనే సైనిక ప్రతిస్పందనలు ఉండొచ్చు.

సమయాన్ని బట్టి అప్పుడప్పుడు ఇవి ఎగసిపడొచ్చు. రెండు దేశాలకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇలానే జరుగుతోంది. అంతేకానీ, విస్తృతస్థాయి సైనిక ఘర్షణకు ఇవి దారితీయవు' అని పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత రెండు దేశాల సంబంధాలు అతి స్వల్పస్థాయికి పడిపోయాయి. పరస్పరం పోర్టుల్లోకి నౌకలను నిషేధించాయి. ఎగుమతులు, దిగుమతులను నిలిపేశాయి.

పహల్గాం ఉగ్రవాదులకు శిక్షణ

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి విచారణలో భాగంగా జమ్మూకశ్మీర్ జైళ్లలోని టెర్రరిస్టుల ఇంటరాగేషన్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దాడిలో పాల్గొన్న వారికి పర్వత ప్రాంతాల్లో రహస్య స్థావరాల నిర్మాణంలో పాక్ ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తేలింది. అంతేకాకుండా రోజుల తరబడి అడవుల్లో నక్కి జీవించడం ఎలానో కూడా వీరికి నేర్పించారు. ఇటీవల అడవుల్లో బయటపడ్డ ఉగ్రస్థావరాలు, ఇతర దర్యాప్తుల విచారణల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ ఉగ్రదాడిలో పాల్గొన్న హాషీమ్ మూసా పాక్ మాజీ పారా కమాండో అన్న విషయం తెలిసిందే. దీంతో భద్రతా దళాలు బైసరన్ లోయ చుట్టూ ఉన్న మార్గాలను పూర్తిగా జల్లెడ పడుతున్నారు. ఇప్పటి వరకు భద్రతా దళాలు ఈ లోయ నుంచి మొదలయ్యే 54 మార్గాలను గుర్తించి తనిఖీలు చేపడుతున్నారు. ఇవన్నీ చిక్కటి అటవీ ప్రాంతం, పర్వతాల మీదుగా సాగుతాయి. ఉగ్రవాదులకు లాజిస్టిక్స్ సాయం చేసిన కొందరు ఓవర్ గ్రౌండ్ వర్కర్లను అదుపులోకి తీసుకొన్న దళాలు... వారిని తీసుకొని ఈ మార్గాలను గాలిస్తున్నాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులకు సాయం చేసిన ఇంతియాజ్ అహ్మద్ అనే వ్యక్తిని దళాలు అదుపులోకి తీసుకొన్నాయి. దీంతో తాను వారికి ఆహారం ఇచ్చినట్లు అంగీకరించాడు. ఉగ్రవాదుల స్థావరం చూపిస్తానని దళాలను అడవిలోకి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి తప్పించుకునేందుకు వేషా నదిలో దూకి ప్రాణాలు తీసుకున్నాడు. మరోవైపు దక్షిణ కశ్మీర్ అడవుల్లో భద్రతా దళాలు భారీస్థాయిలో ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్ చేపట్టాయి. కానీ, ఈ గాలింపు గోప్యత దెబ్బతింటుందన్న అధికారులు... ఆ వివరాలను బహిర్గతం చేయడం లేదు. పూంచ్ వద్ద సురాన్‌కోట్ అడవుల సమీపంలో ఓ ఉగ్రస్థావరాన్ని దళాలు గుర్తించాయి. దీనిలో ఐదు ఐఈడీలు, ఐదు ప్యాకెట్ల యూరియా, ఓ గ్యాస్ సిలిండర్, బైనాక్యూలర్, రెండు వైర్‌లెస్ సెట్లు, కొన్ని దుస్తులు స్వాధీనం చేసుకొన్నారు.

భారత్‌కు అండగా ఉంటాం

మోదీకి పుతిన్ ఫోన్

న్యూఢిల్లీ: భారత్-పాక్ ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీకి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై భారత్ జరుపుతోన్న పోరాటంలో తమ పూర్తి మద్దతు ఉంటుందని పుతిన్ హామీ ఇచ్చారు. రెండు దేశాల మధ్య ఉన్న ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని మోదీ, పుతిన్ పునరుద్ఘాటించారు. మే 9న రష్యా విజయోత్సవాలు నిర్వహించుకోనుంది. దీనిపై అధ్యక్షుడికి మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది రెండుదేశాల మధ్య వార్షిక సదస్సు భారత్‌లో నిర్వహించనున్నారు. అందుకోసం మన ప్రధాని ఆహ్వానం పలకగా... పుతిన్ అంగీకరించారు. ఈ విషయాలను మన విదేశాంగ శాఖ వెల్లడించింది. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడి...26 మందిని చంపిన విషయం విదితమే. ఈ దాడికి తాము బాధ్యులమని పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు చెందిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ప్రకటించుకుంది. దీన్ని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది.

బీజేపీ ఎంపీపై కోర్టు ధిక్కరణ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ... ఓ షార్ట్ ఆర్డర్‌ను పాస్ చేస్తామని వెల్లడించింది. వక్ఫ్ సవరణ చట్టం, బిల్లులపై రాష్ట్రపతికి గడువు విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఎంపీ నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలపై సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదుచేయాలంటూ సుప్రీంకోర్టులో ఓ న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. 'సుప్రీం'పై దూబే చేసిన వ్యాఖ్యలు పూర్తిగా న్యాయవ్యవస్థను అవమానించేలా ఉన్నాయని, అతడిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలంటూ న్యాయవ్యవస్థను కోరారు. ఈ పిటిషన్‌ను స్వీకరించబోమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. అయితే ఎంపీ వ్యాఖ్యలపై ఓ షార్ట్ ఆర్డర్ పాస్ చేసి... కారణాలు నమోదు చేయాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలపడానికి రాష్ట్రపతికి, గవర్నర్లకు మూడు నెలల గడువు విధిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ పంపిన బిల్లులను రాష్ట్రపతి ఎటూ తేల్చకపోతే రాష్ట్రాలు నేరుగా తమను ఆశ్రయించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. ఈ పరిణామాలపై ఉప రాష్ట్రపతి అభ్యంతరం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై కొంతమంది బీజేపీ నేతలు కూడా అభ్యంతరం వ్యక్తంచేశారు. 'సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే... పార్లమెంట్ భవనాన్ని మూసివేయాలి' అని దూబే సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి.

కాన్పూర్‌లో భారీ అగ్నిప్రమాదం... ఐదుగురి మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్ కాన్పూర్ చమన్ గంజ్ ప్రాంతంలోని ఆరు అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వల్ల ఐదుగురు మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... బహుళ అంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో ఫుట్‌వేర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఉన్నది. దీనివల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగి భవనంలో మంటలు చెలరేగి ఉండవచ్చని, ఆ మంటలు పై అంతస్తుల్లో నివశిస్తున్న కుటుంబ సభ్యుల్ని సజీవదహనం చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మంటల్లో మృతి చెందినది డానిష్ కుటుంబంగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో డానిష్‌తోపాటు అతని భార్య నజ్మీ సాబా, ముగ్గురు పిల్లలు మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. 12 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

బయటపడిన ఉగ్ర స్థావరం

శక్తివంతమైన బాంబులు స్వాధీనం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్‌లో ఉగ్రవాదుల స్థావరం బయటపడింది. ఈ స్థావరంలో భారీగా ఇంప్రవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్ (ఐఈడీ)లతో పాటు మరికొన్ని వస్తువులు లభించాయి. భారత సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీస్, స్పెషల్ ఆపరేషన్ గ్రూపు సంయుక్తంగా పూంచ్ జిల్లాలోని మరోటే గ్రామంలో గాలింపు చేపట్టాయి. ఆదివారం రాత్రి జరిపిన ఈ సెర్చ్ ఆపరేషన్‌లో ఉగ్రస్థావరం బయటపడింది. ఐదు ఐఈడీలను, వైర్‌లెస్ సెట్లు, ఉగ్రవాదుల బట్టల్ని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత నుంచి భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్లు ముమ్మరం చేశాయి. దాడికి పాల్పడ్డ ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదుల స్థావరాలు బయటపడుతున్నాయి. తాజాగా, పూంచ్‌లో బయటపడ్డ ఉగ్రస్థావరం కారణంగా భారీ ప్రమాదం తప్పింది. భద్రతా దళాలు సరైన సమయంలో ఆ స్థావరాన్ని గుర్తించకపోతే... మరో ఉగ్రదాడి జరిగి ఉండేది. కాగా, జమ్మూకశ్మీర్‌లో జైళ్లు లక్ష్యంగా ఉగ్రదాడులు జరిగే అవకాశం కనిపిస్తోంది. హైప్రొఫైల్ టెర్రరిస్టులతో పాటు గ్రౌండ్ వర్కర్లు ఉన్న జైళ్లపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశం ఉన్నట్లు నిఘా వర్గాలు సోమవారం హెచ్చరికలు జారీ చేశాయి. పహల్గామ్ ఉగ్రదాడి కేసుకు సంబంధించి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ... భారత సైనిక వాహనాలపై దాడికి పాల్పడ్డ కేసులో అరెస్టైన నిసార్, ముస్తాక్‌ను విచారించింది. ఈ నేపథ్యంలోనే జైళ్లపై దాడి విషయాలు బయటపడ్డాయి. నిఘా వర్గాల హెచ్చరికలతో సీఐఎస్ఎఫ్ అప్రమత్తత ప్రకటించింది.

మన రక్షణ విభాగం వెబ్‌సైట్లపై పాక్ సైబర్ దాడులు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత పాకిస్థాన్ హ్యాకర్లు రెచ్చిపోతున్నారు. భారత్‌పై సైబర్ దాడులకు తెగబడుతున్నారు. ప్రధానంగా భారత రక్షణ విభాగానికి చెందిన వెబ్‌సైట్లు లక్ష్యంగా దాడులు సాగిస్తున్నారు. రక్షణ సిబ్బందికి సంబంధించిన సున్నితమైన సమాచారం, లాగిన్‌లు టార్గెట్‌గా పాక్ సైబర్ దాడి జరుపుతున్నట్టు తెలుస్తోంది. తాజాగా మిలటరీ ఇంజినీర్ సర్వీసెస్, మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని హ్యాక్ చేసినట్టు 'పాకిస్థాన్ సైబర్ ఫోర్స్' అనే సైబర్ గ్రూప్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రకటించుకుంది. రక్షణ మంత్రిత్వ శాఖ అధ్వర్యంలోని ప్రభుత్వరంగ సంస్థ 'ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్' వెబ్‌సైట్ రూపుమార్చేందుకు ఈ గ్రూపు ప్రయత్నించినట్టు రక్షణ వర్గాలు తెలిపాయి. హ్యాకింగ్ ప్రయత్నం వల్ల ఏమైనా నష్టం వాటిల్లిందా అనేది అంచనా వేయడానికి ఆర్మర్డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్ వెబ్‌సైట్‌ను పూర్తి ఆడిట్ కోసం ఆఫ్‌లైన్‌లో ఉంచినట్టు తెలుస్తోంది. పాక్‌తో సంబంధం ఉన్న, స్పాన్సర్ దాడులు గుర్తించేందుకు సైబర్ స్పేస్‌పై నిపుణులు కన్నేసి ఉంచారని, సైబర్ స్పేస్‌లోకి చొరబడకుండా భద్రతను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆ వర్గాలు తెలిపాయి. కాగా, పాకిస్థాన్ సైబర్ ఫోర్స్ తన 'ఎక్స్' హ్యాండిల్‌లో ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్ నుంచి వెబ్‌పేజీ ఇమేజ్‌లను పోస్ట్ చేసింది. అందులో ఇండియన్ ట్యాంక్ ఫొటోకు బదులు పాక్ ట్యాంక్ ఫొటో రీప్లేస్ చేసింది. మరోపోస్ట్‌లో భారత రక్షణ సిబ్బంది పేర్ల లిస్ట్ ఉంది. 'హ్యాక్డ్. సెక్యూరిటీ అనేది మీ భ్రమ. ఎంఈఎస్ డేటా సొంతమైంది' అంటూ మరో పోస్ట్‌లో పేర్కొంది. మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ వెబ్‌సైట్‌లోని 1,600 యూజర్లకు చెందిన 10 జీబీ డాటాను యాక్సిస్ చేసినట్టు క్లెయిమ్ చేసుకుంది.

పర్యాటకుల భద్రతపై పిల్: సుప్రీం కొట్టివేత

న్యూఢిల్లీ: హహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పర్యాటకులకు మరింత భద్రత పెంచాలని కోరుతూ వేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. పిటిషనర్‌పై ధర్మాసనం మండిపడింది. ప్రజల పట్ల నిజమైన ఆందోళన ఇందులో ఏమీ కనిపించడం లేదని, ప్రచారం కోసమే ఈ పిటిషన్ వేసినట్టుగా ఉందని కోర్టు మందలించింది. న్యాయపరమైన జోక్యం అవసరం లేదని తేల్చిచెప్పింది. కొండ ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో పర్యటించే పర్యాటకుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, రాష్ట్రాలను ఆదేశించాలని పిల్‌లో సుప్రీంకోర్టును పిటిషనర్ కోరారు. పర్యాటకుల సందర్శనా ప్రాంతాల్లో సరైన వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా కొండ ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో కచ్చితమైన మెడికల్ ఎయిడ్‌కు జోక్యం చేసుకోవాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎన్.కోటీశ్వర్ సింగ్ స్పందిస్తూ... పిటిషనర్ పదేపదే 'పిల్స్' వేయడాన్ని తప్పుపట్టారు. కేవలం ప్రచారం కోసమే ఇదంతా జరుగుతున్నట్టు కనిపిస్తోందన్నారు. 'మీరు పదేపదే పిల్స్ వేస్తున్నారు. ఎవరి ప్రోద్భలంతో ఇదంతా చేస్తున్నారు' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఇందులో పర్యాటకుల భద్రత తప్పిస్తే ఎలాంటి ఉద్దేశాలు లేవని పిటిషనర్ బదులిచ్చారు. 'ఇది చాలా సున్నితమైన అంశమని మీరు గ్రహించినట్టు లేదు. ఏదో రూపంలో పిటిషన్లు వేసి పబ్లిసిటీ పొందాలనే ఉద్దేశం మినహా ప్రజాప్రయోజనం ఏమీ ఇందులో కనిపించడం లేదు. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం' అని న్యాయమూర్తులు స్పష్టం చేశారు.

భారత్‌పై కుట్రలు చేస్తే తుడిచిపెట్టేస్తాం

పాక్‌కు అనురాగ్ ఠాకూర్ హెచ్చరిక

సిమ్లా: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ సరిహద్దుల్లో భారత సైనికులపై కాల్పులు జరపడంతో పాటు ఇతర కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడంపై కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. పాక్ ఇదే విధంగా సరిహద్దుల్లో సమస్యలు సృష్టిస్తూ... భారత వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తే ప్రపంచపటం నుంచి దానిని పూర్తిగా తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని పోషిస్తున్నందుకు పాక్‌పై భారత ప్రభుత్వం ఇప్పటికే అనేక దౌత్యపరమైన చర్యలు తీసుకుందని, సరైన సమయంలో ఆ దేశానికి తగిన బుద్ధి చెబుతామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని ఠాకూర్ పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ బిందాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 చోట్ల నిరసనలు జరుగుతున్నాయని, పాకిస్థానీయులను రాష్ట్రంలో ఉంచడం సరికాదని, కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం సిమ్లాలో నివసిస్తున్న పాకిస్థాన్ పౌరులను గుర్తించి వెంటనే వారిని తమ స్వదేశానికి పంపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నేతలు డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాక్ పౌరులను గుర్తించడానికి అక్కడి ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని బిందాల్ విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌ను వీడి వెళ్లాలని పాక్ జాతీయులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటి వరకు 786 మంది పాక్ పౌరులు దేశాన్ని వీడారు. వారిలో 55 మంది దౌత్యాధికారులు, వారి డిపెండెంట్లు, సహాయక సిబ్బంది, 8 మంది పాకిస్థాన్ వీసాలున్న భారతీయులున్నారు.

మొఘల్ వారసురాలికి సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: దేశాన్ని వందల ఏళ్ల పాటు పరిపాలించిన మొఘల్ రాజవంశ వారసురాలు... మొఘల్ సామ్రాజ్య చివరి చక్రవర్తి ముని మనవడు మీర్జా మహ్మద్ బేదర్ భక్త్ భార్య సుల్తానా బేగమ్ పేదరికంలో కొట్టుమిట్టాడుతోంది. ఫించన్ డబ్బులతో జీవనం సాగిస్తోంది. ఆ ఫించన్ డబ్బులు సరిపోక మురికివాడల్లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటోంది. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ఆమె... తమ వారసత్వ సంపద అయిన ఢిల్లీలోని ఎర్రకోట కోసం కోర్టు మెట్లు ఎక్కింది. గత కొన్నేళ్ల నుంచి ఎర్రకోటను తమకు అప్పగించాలని కోరుతూ కోర్టుల చుట్టూ తిరుగుతోంది. 2021లో ఆమె ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. సుల్తానా బేగమ్ భర్త మీర్జా మహ్మద్ బేదర్ భక్త్ మొగల్ సామ్రాజ్య చివరి చక్రవర్తి బహదూర్ షా జాఫర్ 2వ వారసుడని ప్రభుత్వమే గుర్తించింది. 1960లో మొగల్ వారసుడిగా గుర్తించిన నాటి నుంచి ప్రభుత్వం అతడికి ఫించన్ ఇస్తూ వచ్చింది. అతడు చనిపోయిన తర్వాత 1980లో ఆ ఫించన్ సుల్తానా బేగమ్‌కు బదిలీ అయింది. ఈ పింఛన్ డబ్బులు తన జీవనానికి సరిపోవటం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకున్న ఎర్రకోటను తమకు ఇచ్చేయాలని డిమాండ్ చేసింది. ఈ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. ప్రభుత్వం ఎర్రకోటను స్వాధీనం చేసుకున్న ఇన్నేళ్ల తర్వాత కోర్టుకు రావటాన్ని కోర్టు తప్పుబట్టింది. అయితే, సుల్తానా మాత్రం తన పోరాటాన్ని ఆపలేదు.

ఈసారి ఏకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. తాజాగా, సుప్రీంకోర్టు దీనిపై విచారణ జరిపింది. పిటిషన్‌ను అర్థం లేనిదిగా భావిస్తూ కొట్టివేసింది. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ... 'ఎర్రకోట మాత్రమే ఎందుకు. ఫతేపూర్ సిక్రీ, తాజ్‌మహాల్ కావాలని అడగొచ్చు కదా. దీనిపై మీరు వాదించాలని అనుకుంటున్నారా. ఇదో చెత్త పిటిషన్' అంటూ మండిపడ్డారు. సుల్తానా బేగమ్ పిటిషన్‌ను కొట్టి పారేశారు.

రాహుల్ పౌరసత్వంపై పిటిషన్ తోసిపుచ్చిన హైకోర్టు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ భారత పౌరసత్వాన్ని ప్రశ్నిస్తూ దాఖలయిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ సోమవారం కొట్టివేసింది. పిటిషనర్ ఇతర ప్రత్యామ్నాయ చట్టపరమైన పరిష్కారాలను అన్వేషించడానికి అనుమతించింది. పిటిషనర్ ఫిర్యాదును పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి కాలపరిమితిని ఇవ్వలేనందున, ఈ పిటిషన్‌ను పెండింగ్‌లో ఉంచడానికి ఎటువంటి సమర్థన లేదని న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఆర్.మసూది, రాజీవ్ సింగ్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ విషయాన్ని కొనసాగించాలనుకుంటే ప్రత్యామ్నాయ చట్టపరమైన పరిష్కారాలను అనుసరించే స్వేచ్ఛను కర్నాటకకు చెందిన బీజేపీ కార్యకర్త, పిటిషనర్ ఎస్.విఘ్నేష్ శిశిర్‌కు కోర్టు తెలియజేసింది. పిటిషన్ ప్రస్తుతానికి తోసిపుచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్న తర్వాత మళ్లీ కోర్టును ఆశ్రయించే హక్కును పిటిషనర్ కలిగి ఉన్నాడు. రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడని నిరూపించే పత్రాలు, బ్రిటీషు ప్రభుత్వానికి చెందిన కొన్ని ఇమెయిల్‌లు తన వద్ద ఉన్నాయని, దీని కారణంగా అతను భారతదేశంలో ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడని, లోక్‌సభ సభ్యుడిగా ఉండలేడని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నాడు. ఏప్రిల్ 21న జరిగిన మునుపటి విచారణలో గాంధీకి బ్రిటిష్ పౌరసత్వం ఉందనే వాదనల గురించి వివరాలు కోరుతూ కేంద్రం బ్రిటన్ ప్రభుత్వానికి లేఖ రాసిందని కోర్టుకు తెలియజేయడం జరిగింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేతకు బ్రిటిష్ పౌరసత్వం ఉందనే వాదనలపై 2024 లోక్‌సభ ఎన్నికలను రద్దు చేయాలని కోరుతూ పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్ ఫలితాన్ని తన ముందు ఉంచేందుకు మే 5 వరకు కేంద్ర ప్రభుత్వానికి ధర్మాసనం సమయం ఇచ్చింది. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వంపై రెండుసార్లు ఫిర్యాదులు పంపానని, కానీ వారు ఎటువంటి చర్య తీసుకోలేదని పిటిషనర్ గతంలో కోర్టుకు తెలిపారు.

నవంబరు 25న వ్యాజ్యాన్ని విచారిస్తున్నప్పుడు పిటిషనర్ ప్రాతినిధ్యంపై తన నిర్ణయం గురించి కేంద్ర ప్రభుత్వం నుంచి సమాచారం కోరింది. పిటిషనర్ ప్రాతినిధ్యంపై చర్య తీసుకుంటూ, సంబంధిత మంత్రిత్వ శాఖ గాంధీ బ్రిటిష్ పౌరసత్వం గురించి వివరాలు కోరుతూ బ్రిటన్ ప్రభుత్వానికి లేఖ రాసిందని, అందువల్ల పిటిషనర్ ప్రాతినిధ్యంపై నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి మరింత సమయం అవసరమని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎస్.బి.పాండే కోర్టుకు తెలియజేశారు.

మోదీతో రక్షణశాఖ కార్యదర్శి భేటీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ సంబంధాలు క్షీణించాయి. తదుపరి చర్యలపై కేంద్ర ప్రభుత్వం కీలక భేటీలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో ప్రధాని నరేంద్రమోదీతో రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సోమవారం భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు ఈ భేటీలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. లక్ష్యాలు, దాడి సమయం అవి నిర్ణయిస్తాయని సీసీఎస్ వెల్లడించింది. ఇటీవల సన్నద్ధతలో భాగంగా యూపీలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలు నిర్వహించింది. వరుసగా నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి, తర్వాత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ మోదీతో భేటీ అయ్యారు. అలాగే రక్షణశాఖ కార్యదర్శి సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కుల సర్వేపై కార్యాచరణ ప్రకటించండి

- రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగించాలి
- కాంగ్రెస్ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం కుల సర్వేకు సంబంధించి కాలక్రమాన్ని, కార్యాచరణను ప్రకటించాలని, అలాగే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని కాంగ్రెస్ పార్టీ సోమవారం పునరుద్ఘాటించింది. ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5) ని అమలు చేయాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష పార్టీ ఎస్సీ, ఓబీసీ విభాగాల అధిపతులు, ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ 24, అక్బర్ రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ ఓబీసీ విభాగం చైర్మన్ అనిల్ జైహింద్ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా, అర్జున్ సింగ్ విద్యా మంత్రిగా ఉన్నప్పుడు 93వ రాజ్యాంగ సవరణ ఆమోదం పొందిందని, దానికి ఆర్టికల్ 15(5) జోడించడం జరిగిందని అన్నారు. 'ఇది దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను అందించింది. ఆ సమయంలో ప్రభుత్వ సంస్థలలో ఈ రిజర్వేషన్ అమలు చేయడం జరిగింది. కానీ ప్రైవేట్ సంస్థల వారు దీనిపై కోర్టును ఆశ్రయించారు. అక్కడ కేసు కొనసాగింది. జనవరి 2014లో ప్రభుత్వం, ప్రైవేట్ విద్యా సంస్థలలో దళితులు, గిరిజనులు, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించవచ్చని నిర్ణయించింది' అని తెలిపారు. 'అప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కొత్త ప్రభుత్వం ఉనికిలోకి వచ్చింది. గత 11 సంవత్సరాలుగా ప్రైవేట్ సంస్థలలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చని రాజ్యాంగంలో ఒక నిబంధన ఉంది. కానీ దీని కోసం ఒక చట్టం చేయాల్సిన అవసరం ఉంది' అని జైహింద్ అన్నారు. అయితే ఇప్పటి వరకు మోదీ ప్రభుత్వం అటువంటి చట్టాన్ని రూపొందించకపోవడం దురదృష్టకరమని, దీని కారణంగా సమాజంలోని అణగారిన, దోపిడీకి గురైన వర్గాలు విద్య ప్రయోజనం పొందలేకపోతున్నాయని చెప్పారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని 'సామాజిక న్యాయానికి అతిపెద్ద అడ్డంకి' అని ఏఐసీసీ ఎస్సీ విభాగం అధిపతి రాజేష్ లిలోథియా అన్నారు. కాంగ్రెస్ దానిని రద్దు చేయాలని కోరుకుందన్నారు. 'రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుల గణన నిర్వహించమని బలవంతం చేసినట్లే, రిజర్వేషన్లపై ఈ 50 శాతం పరిమితిని కూడా తొలగిస్తాం' అని చెప్పారు. కేంద్రం ఓబీసీలు (ఆర్థికంగా బలహీన వర్గాలు) పేరుతో సాధారణ కులానికి 10 శాతం రిజర్వేషన్లు మంజూరు చేసింది. దీనిని సుప్రీం కోర్టు కూడా ఆమోదించింది. ఇది 50 శాతం పరిమితిని కూడా దాటవచ్చని స్పష్టమయిందని ఆయన అన్నారు. 'బీజేపీ సాధారణ కులం కోసం దీన్ని చేయగలిగితే, అణగారిన, దోపిడీకి గురైన వారి కోసం ఎందుకు చేయలేకపోతుంది? మోదీ ప్రభుత్వం కుల గణనను ప్రకటించింది. కానీ దాని పూర్తి కాలక్రమం బహిర్గతం చేయాలనేది మా డిమాండ్. దీనితో పాటు కుల గణన మొత్తం ఫార్మాట్ గురించి చర్చించాలి' అని లిలోథియా అన్నారు. అణగారిన, దోపిడీకి గురైన, అణచివేతకు గురైన వారి గొంతుకను బలమైన రీతిలో లేవనెత్తనంత వరకు, వారు సామాజిక న్యాయం పొందలేరని రాహుల్ గాంధీ నొక్కిచెప్పారని లిలోథియా అన్నారు. 'ఈ రోజు బీజేపీ, నరేంద్ర మోదీ... రాహుల్ గాంధీ ముందు తలవంచాల్సి వచ్చింది' అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం చైర్మన్ విక్రాంత్ భూరియా మాట్లాడుతూ కుల సర్వే చరిత్రలోనే 'అతిపెద్ద నిర్ణయం' అవుతుందని అన్నారు. 'రాహుల్ గాంధీ కుల గణన అంశాన్ని లేవనెత్తిప్పుడు, బీజేపీ నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. బీజేపీ, నరేంద్ర మోదీ ఎప్పుడూ కుల గణనకు అనుకూలంగా లేరని ఇది చూపిస్తుంది. గతంలో నరేంద్ర మోదీ కులం గురించి మాట్లాడటం పాపమని, అర్బన్ నక్సల్ ఆలోచనలో భాగమని. దేశంలో నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయని చెప్పేవారు. కానీ ఇప్పుడు మోదీ చాలా పెద్ద విప్లవమని గ్రహించినందున ఆయన యూ-టర్న్ తీసుకున్నాడు' అని అన్నారు. 'కుల గణన కోసం బీజేపీ ప్రభుత్వ కార్యాచరణ ఏమిటి, దాని కాలక్రమం ఏమిటి, దాని వివరాలు ఎలా ఉంటాయో మేము తెలుసుకోవాలనుకుంటున్నాము' అని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం, మోదీ నుంచి మా డిమాండ్ ఏమిటంటే, కుల గణనపై మాకు ముఖ్యాంశాలు వద్దు... కుల గణన కోసం మాకు కాలక్రమం, గడువు కావాలి' అని అన్నారు. ప్రభుత్వం భయంతోనే ఈ అడుగు వేసిందని భూరియా పేర్కొన్నారు.

విశాలాంధ్ర
హైదరాబాద్

ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

విశాలాంధ్ర - పటాన్ చెరువు : రహదారుల విస్తరణతోనే దేశ ఆర్థిక అభివృద్ధి మరింత పటిష్టంగా మారుతుందని, దేశంలోనే అన్ని జాతీయ రహదారుల విస్తరణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన ప్రణాళికలను రూపొందించిందని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావు స్పష్టం చేశారు. సోమవారం పటాన్చెరు నియోజకవర్గం అశోక్ నగర్ బిహెచ్ఎల్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్‌ను కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్‌రావులతో కలిసి ఫ్లై ఓవర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండ సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ సుమారు 136 కోట్లతో నిర్మించిన ఫ్లై ఓవర్‌ను ప్రారంభించడం చాలా సంతోషదగ్గ విషయమని స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్న జనాభా కనుగుణంగా బిహెచ్ఎల్ చౌరస్తాను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. బిహెచ్ఎల్ చౌరస్తాలో గంటల తరబడి ట్రాఫిక్ కష్టాలతో సిగ్నల్స్‌తో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ఉండే వారని వారిని నేటితో ఈ సమస్యకు చెక్ పడుతుందని అన్నారు. నూతన ఫ్లైఓవర్ నిర్మాణంతో వాహనదారులందరూ ట్రాఫిక్ కష్టాలు తీరిపోనున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ సి అంజిరెడ్డి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో ప్రజలు అందచేసిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 99 దరఖాస్తులను అయన స్వీకరించారు. అట్టి అర్జీలను శాఖాధికారులు సత్వరమే పరిశీలన చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో హౌసింగ్ 35, పెన్షన్ 21, రెవెన్యూ 20, ఇతర శాఖలకు సంబంధించినవి 23 దరఖాస్తులు అందాయని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఈ. వెంకటచారి, ఆర్డిఓ రామకృష్ణ, జిల్లా అధికారులు జి.ఆశన్నా, ఆర్.కోటజీ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణీ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జిహెచ్ఎంసిహెడ్ ఆఫీస్‌లో నిర్వహించే ప్రజావాణిలో పాల్గొని విన్నపాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంభందిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజల నుండి పలు సమస్యలను సాధ్యమైన మేరకు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, రఘుప్రసాద్, వేణుగోపాల్ చంద్రకాంత రెడ్డి, పంకజ గీతా రాధిక, టౌన్ ప్లానింగ్ అడిషనల్ సీసీపిలు వీరన్న ప్రదీప్ ప్రజల నుండి విన్నపాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమీషనర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం వినతులపై వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి వ్యాప్తంగా మొత్తం 171 దరఖాస్తులు వచ్చాయని అందులో టౌన్ ప్లానింగ్ విద్యుత్ దీపాలు, తదితర సమస్యలపై ప్రజలు విన్నపాలను అందజేశారు. హెడ్ ఆఫీస్‌లో మొత్తం 75 విన్నపాలు రాగా అందులో 70 దరఖాస్తులు రాగా టెలిఫోన్ ద్వారా 5 విన్నపాలు వచ్చాయి అన్ని జోనల్‌తో కలిపి 96 విన్నపాలు స్వీకరించారు. సికింద్రాబాద్ జోన్‌లో 30 విన్నపాలు రాగా, చార్మినార్ జోన్‌లో 2, ఎల్.బి నగర్ 11, కూకట్‌పల్లి 32, ఖైరతాబాద్ 03, శేరిలింగంపల్లి జోన్‌లో 18 విన్నపాలు స్వీకరించారు. ఈ సమావేశంలో చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, యుబిడీ డైరెక్టర్ వెంకటేశ్వర్, వాటర్ వర్క్స్ డిజిఎం సాయి రమణ, విద్యుత్ శాఖ ఇంచార్జీ యస్.ఈ మమత, హౌసింగ్ ఈ.ఈ.పి.వి.రమణ, రాజేశ్వర్‌రావు, ఎస్టేట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో సమావేశానికి తరలి వెళ్ళిన కాంగ్రెస్ శ్రేణులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌లోని వి.బి.ఆర్ గార్డెన్‌లో కార్యవర్గ సమావేశానికి మల్కాజిగిరి చౌరస్తాలోనీ గాంధీ పార్క్ నుండి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి వెళ్ళారు. ర్యాలీనీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్ ర్యాలీనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేం కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని, నిరుపేదల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు డివిజన్ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను తహసీల్దారు రాజశేఖర్ రెడ్డితో కలిసి డిఆర్ఓ హరిప్రియ స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (91) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ సూచించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్ మల్కాజిగిరి: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం సూచించారు. భూ భారతీ పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం ధర్మారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. రైతులు అందించిన దరఖాస్తులను, సిబ్బంది పనితీరును పరిశీలన జరిపి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్దీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ధరణిలో పెండింగ్ ఉన్నవా, లేవా అని ముందుగా అడిగి తెలుసుకుని, ధరణిలో పెండింగ్‌లో ఉంటే ధరణిలో ఉన్న నంబరు ఆ ధరఖాస్తుపై వేసి ఆన్‌లైన్‌లోనే వాటిని పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను సమస్యల వారిగా విడివిడిగా బంచులుగా చేసుకొవాలన్నారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి అప్పటికప్పుడే పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను కీసర మండల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.

అనంతరం నర్సంపల్లిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును కూడా పరిశీలించి కలెక్టరు సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. ఈ సదస్సులలో లా ఆఫీసర్ చంద్రావతి, కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఎంఆర్ఓ అశోక్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి దిక్సూచి కార్ల్ మార్క్స్ సిద్ధాంతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కార్మిక వర్గం చైతన్యమై సమస్యల పరిష్కారానికి తిరుగుబాటు చేసినప్పుడే సోషలిజం స్థాపన, శ్రమదోపిడి లేని సమాజ స్థాపన సాధ్యం అవుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివిఎస్ బోస్ పిలుపునిచ్చారు. సోమవారం హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద కార్ల్ మార్క్స్ 207వ జయంతి కార్యక్రమం సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ, మేధావి అభ్యుదయవాది అయినటువంటి కార్ల్‌మార్క్స్ 1818 మే 5న జర్మనీలో జన్మించారని అనేక ఆటుపోట్లు కష్టనష్టాలను, అనుభవించారని, పెట్టుబడిదారీ వ్యవస్థను ఏ విధంగా ఎదుర్కోవాలి. శ్రామిక కార్మిక వర్గాన్ని ఏ విధంగా కాపాడుకోవాలని మార్క్స్ సిద్ధాంతం ద్వారా ఈ ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మార్క్స్ అని వారన్నారు. ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలు సోషలిస్ట్, పార్టీలు మార్క్స్ సిద్ధాంతం మీద ఆధారపడి ఉన్నాయని వాటి మీదనే ఆధారపడి నడుస్తాయని మార్క్స్ సిద్ధాంతాన్ని మించింది ఇంకొకటి లేదని వారు అన్నారు. వారు చూపించిన బాటలో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ద్వారాలు తెలిసి శ్రామికుల శ్రమను దోచి వారి గడియలను నింపేందుకు కార్మిక చట్టాలను మార్చి యజమాని అనుకూల లేబర్ కోడ్లను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని దానిని తిప్పికొట్టేందుకు ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి ప్రేమ్ పావని ప్రసంగించగా ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి వెంకటయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొడ్డుపల్లి కిషన్, కె రమేష్, పి రాజేష్, జి ధర్మపురి, పి కళ్యాణ్ బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : జిహెచ్ఎంసి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్‌కు సంబంధించిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని, మల్కాజిగిరి సర్కిల్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సికింద్రాబాద్ జోన్ జాయింట్ కమిషనర్‌కి అందజేశారు. ముఖ్యంగా నేరేడ్‌మెట్ డివిజన్‌లోని స్వర్ణాంధ్ర కాలనీ, గోల్ఫ్ ఫ్రెడ్స్‌లో డ్రైనేజ్ అవుట్లెట్ సమస్య, బాక్స్ డ్రెన్ నిర్మాణం, భరణి కాలనీ స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని, మధుర నగర్ మెయిన్ రోడ్డు నుండి రేణుక నగర్ వరకు బాక్స్ డ్రెన్ నిర్మాణం చేపట్టాలని, వినాయక నగర్ డివిజన్‌లో ముస్లిం స్మశాన వాటికలో ఉన్న రాతి శిలలను తొలగించాలని, నీటిపారుదల శాఖ సంబంధించి నియోజకవర్గంలోని నాలాలు, చెరువులకు సంబంధించిన విషయాల గురించి చర్చించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్, సిటీ ప్లానర్ శ్రీనివాస్, టీపీఎస్ సంగీత, డి.ఈ. పద్మలత, ఆర్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్, ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసన్న, సీనియర్ ఎంటమాలజీ దుర్గా ప్రసాద్, వెటర్నరీ సద్గుణ, ఇరిగేషన్ డిఈ శుక్లజ, ఏఈ సుధీర్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు రావుల అంజయ్య, జి.కే హనుమంతరావు, మధుసూదన్ రెడ్డి, శివకుమార్, దారా శ్రీనివాస్ రెడ్డి, చిందం శ్రీనివాస్, భాగ్యనంద్, ఇబ్రహీం, వంశీ, రాజశేఖర్ రెడ్డి, సంతోష్ గుప్తా, కాలనీవాసులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-దుండిగల్: బిజెపి దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి సోమవారం మేడ్చల్ - మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్‌ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మున్సిపాలిటీ పరిధి నందు వివిధ గ్రామాలలో స్థానికంగా నెలకొన్న పలు ప్రజా సమస్యలు గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సాంక్షన్ అయ్యి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి అయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మహిళా నాయకురాలు ఎన్ రోజా, కొమ్ము ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మెట్రో రైల్ చార్జీలు పెంచొద్దు

సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆర్థిక నష్టాలను, విద్యుత్ చార్జీల భారాన్ని బూచిగా చూపుతూ హైదరాబాద్ మెట్రో రైల్ చార్జీలు పెంచొద్దని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి. నరసింహ డిమాండ్ చేసారు. హైదరాబాద్ మఖ్దూమ్ భవన్ నుండి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో హైదరాబాద్‌లో మెట్రోపై రోజుకు ఐదు లక్షల మంది ప్రయాణికులు ఆధారపడుతున్నారని, అసాధారణ ఛార్జీల పెంపు ప్రజా రవాణా వినియోగదారులపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని, ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని అయన తెలిపారు. చెన్నై మెట్రో ఛార్జీని చివరిగా ఫిబ్రవరి 22, 2021న సవరించారని, అప్పుడు ఎక్కువ మంది ప్రయాణికులు ఈ సేవలను ఉపయోగించుకునేలా ప్రోత్సహించడానికి గరిష్ట ఛార్జీని రూ.70 నుండి రూ.50కి తగ్గించారని, దింతో అక్యూపెన్సీ పెరిగి చెన్నై మెట్రోకు నష్టాలు కూడా తగ్గాయని గుర్తు చేసారు. మెట్రో రైల్ ఛార్జీల పెంపు అనివార్యమని భావిస్తే ప్రయాణికులపై భారం పడకుండా ఎల్ అండ్ టి, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఇతర ఆదాయ మార్గాలను అన్వేషించుకోవాలని కోరారు. మెట్రో చార్జీలు పెంచితే సహించేదిలేదని, పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఈ.టి. నరసింహ హెచ్చరించారు.

భారతదేశంలో మొదటి గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : బంగారు లావాదేవీలలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సాంకేతికతతోనే ఇది సాధ్యమవుతుంది. దీనికి గోల్డ్ సిక్కా 2022లోనే పూనుకుంది. అయితే, మరింత ఆధునికతతో ప్రజలలోకి వెళ్లడంలో భాగంగా భారతదేశంలో మొదటి గోల్డ్ మెల్టింగ్ ఏటీఎంను బేగంపేటలో త్వరలో ప్రారంభించబడునుంది. ఈ సందర్భంగా గోల్డ్ సిక్కా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎస్‌వై తరుజ్ మాట్లాడుతూ ఈ ఏటీఎం ద్వారా బంగారాన్ని కొనడం, అమ్మడం, మార్చడం, లీజుకు ఇవ్వడం, డిజిటైజ్ చేయడం చేయవచ్చన్నారు. బంగారు రుణాలు మినహా అన్ని సేవలు ఇది అందిస్తుందని చెప్పారు. ఇందులో మనం ఆభరణాలు కూడా కొనుగోలు చేయవచ్చన్నారు. ఇది పూర్తిగా ఆటోమేటెడ్ టెలర్ మెషిన్ అన్నారు. ఎటువంటి మానవ జోక్యం ఉండదన్నారు. ప్రపంచంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత గోల్డ్ మెల్టింగ్ ఏటీఎం ఇదన్నారు. ఈ అత్యాధునిక యంత్రం బంగారానికి సంబంధించిన అనేక సేవలు సమగ్రంగా అందిస్తుందన్నారు. భారతదేశంలో మొట్టమొదటి రియల్ టైమ్ గోల్డ్ ఏటీఎం 2022లో ప్రవేశపెట్టామని, ఈ విజయంతో తదుపరి తరం ఏటీఎం మరింత ఆధునికతతో ముందడుగు వేశామన్నారు. ప్రత్యేకంగా ఈ ఏటీఎంలో అగ్యుమెంటెడ్ రియాల్టీ (ఏఆర్) అనుభూతి లభిస్తుందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా వినియోగదారులు ఆభరణాలను వర్చువల్‌గా ధరించవచ్చని, నచ్చితే కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

ఒబెన్ ఎలెక్ట్రిక్ ప్రొటెక్ట్ 8/80 ప్లాన్ లాంచ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఒబెన్ ఎలక్ట్రిక్, భారతదేశంలోని ప్రముఖ స్వదేశీ ఆర్ అండ్ డి నడిచే ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీదారు. అది ప్రొటెక్ట్ 8/80 ప్లాన్ లాంచ్‌తో వినియోగదారుల నమ్మకాన్ని అమాంతం పెంచేసింది. మే 1 నుంచి వినియోగదారులు ఈ సమగ్ర బ్యాటరీ వారంటీని పొందవచ్చు. అది 9,999 సరసమైన ధరకే అది 80,000 కిలోమీటర్ల కవరేజ్‌ని, 8 సంవత్సరాల సమగ్ర బ్యాటరీ వారెంటీని అందిస్తుంది. ప్రయాణీకుల ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ విభాగంలో మొట్టమొదటిసారిగా, ప్రొటెక్ట్ 8/80 పనితీరు, విశ్వసనీయత వినియోగదారుల మొదటి ఆవిష్కరణ పట్ల ఒబెన్, తిరుగులేని నిబద్ధతను నొక్కి చెబుతుంది. బ్రాండ్ ఒబెన్ ప్రొటెక్ట్ ప్లాట్‌ఫారమ్ క్రింద అందించబడిన, వారంటీ బ్యాటరీ పనితీరుపై పూర్తి కవరేజీని నిర్ధారిస్తుంది, రిపేర్లు, మార్పిడులు, అన్ని బ్యాటరీ సంబంధిత ఆందోళనలతో సహా, వినియోగదారులు సంవత్సరాల తరబడి ఆందోళన లేకుండా ప్రయాణించేలా చూస్తారు. రోర్ ఈ జెడ్ టాప్ స్పీడ్, యాక్సిలరేషన్ వారంటీ వ్యవధిలో స్థిరంగా ఉంటాయని వినియోగదారులకు హామీ ఇస్తున్నారు. రోర్ ఈజెడ్‌కి ప్రత్యక్ష పునఃవిక్రయం విలువను జోడించడంతో పాటు విశ్వసనీయమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రయాణీకుల మోటార్‌సైకిల్‌గా దాని స్థితిని మరింత మెరుగుపరుస్తుంది.

మార్కెట్ యార్డులో రైతులకు మధ్యాహ్న భోజనం

విశాలాంధ్ర - అమనగల్లు : రైతుల ప్రయోజనాలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని అమనగల్లు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యాట గీత నర్సింహా అన్నారు. సోమవారం అమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు కడుపు నిండా అన్నం పెట్టాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నందుకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ వస్పుల శ్రీశైలం, తాళ్ళ రవీందర్, అజీమ్, రమేష్ గౌడ్, నరేష్ నాయక్ అంజయ్య గుప్తా, శ్యామసుందర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ నాయకులు గుర్రం కేశవులు జగన్ కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి బిచ్చ నాయక్ ఇమ్రాన్ బాబా మల్లయ్య, ఎగిరిశెట్టి సత్యం, ఖాదర్ బాలరాజ్, నారాయణ నరేష్, నాసర్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కొప్పు విజేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి

విశాలాంధ్ర - తూర్కయంజాల్ : కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ల జాయింట్ ఫ్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపుమేరకు మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదని అన్నారు. కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందని కార్మికుల సమిష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం అవుతుందని ఉద్యోగ భద్రత ఉపాధి కోల్పోతారని అన్నారు. దేశంలోని కార్మికుల స్థితిగతులు అన్నింటిని సమీక్ష చేసిన కేంద్ర కార్మిక సంఘాలు స్వాతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని ఆ పిలుపులో మున్సిపల్ కార్మిక వర్గం పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కాంట్రాక్టు విధానం రద్దుచేసి ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా నియమించుకున్న కార్మికులందరికీ పాత కార్మికుల వలె వేతనాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, పెరుగుతున్న పట్టణ విస్తరణ కనుగుణంగా సిబ్బందిని నియమించాలని అన్నారు. ఆదివారాలు పండుగ సెలవులు కార్మికులందరికీ వర్తింపజేయాలని కోరారు. సిఐటియు తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు యం సత్యనారాయణ, జే ఆశీర్వాదం, బి మాల్యాద్రి, ఏ మాధవరెడ్డి మున్సిపల్ యూనియన్ నాయకులు చెక్క దయానంద్ ప్రవీణ్ సరిత నాగమణి పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు : ఎంపీ మల్లు

విశాలాంధ్ర - అమనగల్లు: రైతులెవరు అధైర్యపడవద్దని చివరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మధ్య దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలోని ముద్విన్, కడ్తాల గ్రామాల్లో వరి కొనుగోలు కౌంటర్లను ఎంపీ మల్లు రవి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, పిఎసిఎస్ పాలకవర్గంతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కౌంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రైతులకు ప్రతిరోజు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని రైతులెవరు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతన్నలకు మద్దతు ధర ఇచ్చేందుకే సింగల్ విండోల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం ఆమనగల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ధాన్యం తూకం వేసిన అనంతరం డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని తెలిపారు. రైతులు అరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని కోరారు. పకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని.. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అబద్ధపు మాటలను రైతులు నమ్మవద్దని మల్లు రవి సూచించారు. వరి ధాన్యం క్వింటాలుకు మద్దతు ధర రూ, 2320, గా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. సన్న రకం వరి దాన్యం క్వింటాలుకు రైతులకు ప్రోత్సాహకంగా

అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్: అశోక్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యక్తిగత కార్యదర్శి లింగారెడ్డిగూడెం అశోక్‌కు విషెస్ చెప్పారు. సోమవారం లింగ రెడ్డి గూడ అశోక్ జన్మదిన పురస్కరించుకొని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి శ్రీధర్‌బాబుకు పరిచయం చేశారు. తనకు అన్ని విషయాల్లో చేదోడు వాదోడుగా ఉంటున్న అశోక్ గురించి మంత్రికి విన్నవిస్తు అతని జన్మదినం అని చెప్పగానే మంత్రి శ్రీధర్‌బాబు వెంటనే హ్యాపీ బర్త్ డే అశోక్ అంటూ విషెస్ చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా కార్యకర్తకు విషెస్ చెప్పడంతో లింగారెడ్డిగూడెం అశోక్ ఎంతో సంతోషపడ్డారు. మంత్రికి అదే విధంగా ఎమ్మెల్యే శంకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు రైతులకు మేలు

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : అవగాహన సదస్సులు రైతులకు ఎంతో మేలు చేస్తాయని డిసిసిబి ఛైర్మెన్ కొత్తకుర్మ సతయ్య అన్నారు. సోమవారం రైతు సేవ సహకార సంఘం ప్రధాన కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, హైదరాబాద్ వారు రైతుల కోసం వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, యూనివర్సిటీ అనుబంధ సంస్థ వారి ఏఎన్ఎంపి ప్రోగ్రాం ద్వారా ప్రిన్సిపాల్ రజినీకాంత్ రైతులకు సలహాలు ఇచ్చారు. రైతులు సహజ విధానాలతో వ్యవసాయం చేసేలా అవగాహన పెంచుకోవాలని, రైతులు ఇలాంటి సదస్సులకు హాజరై సందేహాలు అడిగి, వాటి నుంచి పూర్తిగా ఉపయోగం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్ సంజీవ్ రెడ్డి, సంఘం సీఈఓ వై.రాందాస్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ పల్లవి, ఏఈఓ రఘుపతి, వ్యవసాయ శాస్త్రవేత్త అరుణ శ్రీ, స్థానిక రైతులు లక్ష్మా రెడ్డి, బలదేవ్ రెడ్డి, కృష్ణ రెడ్డి, శేఖర్‌రెడ్డి, కోషిక ఐలయ్య, కుంట గోపాల్‌రెడ్డి, ప్రజలు, యూనివర్సిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

20కి పైగా చలి వేంద్రాలను ఏర్పాటు చేశాం : ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వేసవి కాలంలో ప్రజల దాహార్తిది తీర్చడానికి మల్కాజిగిరి నియోజక వర్గంలో ప్రధాన కూడలిలలో 20పైగా చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండలు తీవ్రతకు పనుల నిమిత్తం ప్రయాణం చేసే ప్రజలకు చల్లటి మంచినీటిని అందించాలనే సంకల్పంతో మల్కాజిగిరి నియోజక వర్గంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి పార్టీ శ్రేణులను సమాయత్తం చేయగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు వేగంగా స్పందించడం జరిగిందని, ఇలాగే నాయకులు ప్రతి విషయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: గ్రేటర్ హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల స్థితిగతులను తెలుసుకునేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ తమ క్షేత్రస్థాయి కార్యకర్తలు, యువ నాయకులతో కలిసి నగరవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కార్యక్రమం చేపట్టిందని ఆమ్ ఆద్మీ పార్టీ సెంట్రల్ జోనల్ సభ్యులు విజయ మల్లంగి, జావిద్ షరీఫ్, బాబూలాల్ పవర్, సుధారాణి, షాబాజ్, లేయాకత్, అజీం బెగ్ తెలిపారు. ఈ సర్వే ఆధారంగా సోమవారం ఆమ్ ఆద్మీ పార్టీ సెంట్రల్ జోన్ కమిటీ నాయకులు హైదరాబాద్ కలెక్టర్ ఆఫీస్ వద్ద నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల సర్వే నివేదికను హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ డాక్టర్ జి.ముకుందరెడ్డికి అందజేశారు. ఫిలింనగర్ రౌండ్ టేబుల్ గవర్నమెంట్ హై స్కూల్, హిమాయత్‌నగర్ గవర్నమెంట్ హైస్కూల్లో విరిగిపోయిన అపరిశుభ్రమైన మరుగుదొడ్ల వల్ల పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఇది చాలా బాధాకరమని తెలిపారు. 1000 మందికి పైగా చదువుతున్న ఇలాంటి ఎన్నో బడులలో కేవలం ఒకటి లేదా ఇద్దరు ఆయమ్మలు ఉండటం వలన మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచలేకపోతున్నారు. పాఠశాలలో చదువుతున్న పిల్లల సంఖ్య అనుగుణంగా ఆయమ్మలను నియమించుకునేందుకు స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌ను పెంచి హెడ్మాస్టర్లకు అందజేయాలని కోరారు. వేసవి సెలవులు ముగిసి మళ్లీ తరగతులు జూన్ 12 మొదలయ్యేలోపు తాము ప్రస్తావిస్తున్న ఐదు డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత సర్వే" నిర్వహించి అందులో తరగతి గదులు, విరిగిన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, ఆటస్థలం పరిస్థితి మొదలైన లోపాలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలనీ, రెండవది, ఆయమ్మల సంఖ్యను 150 మంది విద్యార్థులకు కనీసం 1కి పెంచాలి. మూడవది, పాఠశాలలో ఉన్న అన్ని సీసీటీవీ పని స్థితిని పరిశీలించి అవసరమైన చోట కొత్త కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. నాల్గవది, సామాజిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు పాఠశాల ప్రాంగణాన్ని రాత్రిపూట చట్టవిరుద్ధంగా ఉపయోగించకుండా నిరోధించడానికి పాఠశాలల వద్ద రాత్రి భద్రతా గార్డును నియమించాలి. ఆఖరిగా, పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఆక్రమణలను ప్రవేశద్వారంలో ఉన్న అడ్డంకులను తొలగించాలన్నారు.

బంధంకొమ్ము రహదారి విస్తరణ పనులు ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పటాన్ చెరువు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని వాణి నగర్, లాలాబావి, పెద్ద చెరువు మీదుగా బంధం కొమ్ము వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పటాన్ చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా 23 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. బంధం కొమ్ము పరిధిలో విద్యుత్ స్థంబాల తరలింపు, నూతన లైన్ల ఏర్పాటు కోసం గతంలో 4 కోట్ల 70 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వాణి నగర్ నుండి పెద్ద చెరువు వరకు రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. అతి త్వరలో మిగిలిన పనులను సైతం పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఎమ్మార్వో వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, విద్యుత్ శాఖ డీఈ భాస్కర్‌రావు, మున్సిపల్ ఇంజనీరింగ్ డీఈ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలపై పర్యవేక్షణ కరువు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కొన్ని సర్కిల్లో కనిపించని పరిస్థితి నెలకొంది. కాప్రా సర్కిల్ ప్రాంతంలో శిక్షణ శిబిరాలు ఎక్కడ కూడా ప్రారంభం కాకపోవడం చూస్తే జిహెచ్ఎంసి స్పోర్ట్స్ అధికారులు పని తీరు ఇట్టే అర్థమవుతుంది. ఈ సంవత్సరం వేసవి క్రీడా పోటీలు ఏప్రిల్ 25 నుండి ప్రారంభం కాగా కొన్ని సర్కిల్లో కోచులకు సమాచారమే లేకపోవడం శోచనీయం. జిహెచ్ఎంసి 915 కేంద్రాలలో 44 స్పోర్ట్ ఈవెంట్‌లలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని గొప్పలు చెప్పుకుంటున్న స్పోర్ట్స్ అధికారులు కొన్ని సర్కిల్లో అన్ని విభాగాలకు కోచులు అందుబాటులో ఉంచాలని పరిస్థితి నెలకొంటుంది. ఈ శిబిరాల్లో క్రీడా క్విజ్‌లు క్రికెట్ వాలి బాల్ బ్యాట్మెంట్, జూడో, కరాటే, సాంప్రదాయ క్రీడలతో పాటు ఆసక్తి ఉన్న నవీన క్రీడల పట్ల కూడా శిక్షణ యిచ్చి నిష్ణాతులుగా తయారు చేయాలని సంకల్పించనప్పటికీ స్పోర్ట్స్ ఉన్నతాధికారుల అలసత్వం వల్ల శిక్షణ శిబిరాలు మొక్కుబడిగా సాగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ప్రతి ఏటా నిర్వహించే ఈ శిక్షణ శిబిరాలలో పలు విభాగాల్లో కోచ్‌లు లేకపోయినా ఆయా క్రీడలకు పొచ్‌లో పేరుతో వేతనాలు వెళుతున్నట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికైనా గ్రేటర్ ఉన్నతాధికారులు వేసవి శిక్షణ శిబిరాలపై ప్రత్యేక దృష్టి సారించి శిక్షణ శిబిరాలను విజయవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మార్క్స్ సిద్ధాంతమే నేటి సమాజానికి ఆదర్శనీయం

విశాలాంధ్ర - కాప్రా : మార్క్స్ సిద్ధాంతమే నేటి సమాజానికి ఆదర్శనీయమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ తెలిపారు. కార్ల్ మార్క్స్ 207వ జయంతిని పురస్కరించుకుని ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సీపీఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో, మార్క్స్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ 207 సంవత్సరాల క్రితం 1818మే 5న జన్మించి, 1883 మార్చి 14న తన 65వ ఏట మరణించారని, ఆయన తన జీవిత కాలమంతా చాలా విస్తృతమైన పరిధిలో మార్క్సిస్టు సిద్ధాంతంను అనుసరించాడని వారు అన్నారు. మార్క్స్, అతని సహచరుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ కలిసి చరిత్ర భౌతిక వాద అవగాహనను రూపొందించాడని. అదే చారిత్రిక భౌతికవాదంగా పేరుగాంచిందని అని అన్నారు. మార్క్స్ రచనలలోకెల్లా ప్రత్యేకమైనదీ, అద్భుత మైన గొప్ప గ్రంథం 'పెట్టుబడి' అని వారు తెలిపారు. ఒకానొక దశలో ఉత్పత్తి విధానం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ విధంగా నడుస్తుందో తెలియజేస్తూ దాని లోతులన్నింటినీ బహిర్గతం చేశాడన్నారు. సమాజాన్ని అర్థంచేసుకోవడానికీ, దానిని మార్చడానికి అవసరమైన ఒక విధానాన్ని ఆయన రూపొందించాడన్నారు. విజ్ఞాన రంగాలన్నింటా మార్క్సిజాన్ని అభివృద్ధిపరచి తాజా పరిచే బాధ్యత మార్క్సిస్టులందరిదీ అని వారు తెలిపారు. ఇటువంటి కృషి ద్వారా మాత్రమే మనం సామాజిక మార్పు సాధించాలనే మన లక్ష్యాన్ని చేరుకోగలమని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ జయంతి కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు, సీపీఐ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, రాఘవేంద్రరావు, సత్య ప్రసాద్, సాయిలు, అశోక్, కిరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మౌలిక వసతులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నియోజకవర్గం పేట్ బషీరాబాద్ నందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నెలకొని ఉన్న మౌలిక వసతుల సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చాలనే ఆలోచనతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ సకల సదుపాయాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. ఇల్లు పొందిన లబ్ధిదారులు అక్కడ ఉండేందుకు అవసరమైన కనీస అవసరాలను అందించడంలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా మౌలిక వసతుల కల్పనలో భాగంగా మంచినీటి సరఫరా, పారిశుద్ధ నిర్వహణ, విద్యుత్ సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, రవాణా సౌకర్యం, ప్రార్థన మందిరాల నిర్మాణానికి స్థలాల కేటాయింపు వంటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని రోజుకు రెండు సార్లు నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టాలి. విద్యుత్ సమస్యలలో భాగంగా వీధిదీపాల ఏర్పాటు, ట్రాన్స్ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. లబ్ధిదారులకు సొంతింటి ధీమాను కల్పించడంలో భాగంగా ఇంటి నెంబర్లు కేటాయించాలి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోని లబ్ధిదారులకు ప్రార్థనలకై దేవాలయానికి, మసీదు, చర్చి వంటి ప్రార్థన మందిరాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆమోదించారు. హౌసింగ్ బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్, మున్సిపాలిటీ, ఇంజనీరింగ్, వివిధ శాఖల అధికారులు, నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్, దుండిగల్, డి.పోచంపల్లి, బహదూర్ పల్లి ప్రాంతాలకు చెందిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల హామీని అమలు చేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 17 నెలలు గడచిన కొన్ని శాఖలకు మంత్రులను నియమించలేదని, ఆరుగురు మంత్రులను వెంటనే నియమించాలన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన వమీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ళను అర్హులైన వారందరికీ మంజూరు చేయాలన్నారు. అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి పించన్ ఇవ్వాలన్నారు. స్వయం సహాయ సంఘాలకు రూ.1 కోటి వరకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని అన్నారు. రైతు కూలీలకు 12 వేల ఆర్థిక సహాయం ఇస్తామని హామీ ఇచ్చారని దీనిని వెంటనే అమలు చేయాలని మాండ్ చేశారు. క్యాబ్, ఆటో డ్రైవర్లకు రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని, కౌలు రైతులకు రూ.15 వేల రైతు బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జి.శంకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, నాయకులు నర్సింగ్, సంపత్, స్వరూప, ఎం.సురేఖ, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఒటిటి కంటెంట్ ఆవరణని ప్రజాస్వామీకరిస్తున్న డిష్ టివి వాచో

FLIQS ON WatchO

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : భారతదేశపు ప్రముఖ కంటెంట్ పంపిణీ సంస్థల్లో ఒకటి, భారతదేశంలో తొలి డైరెక్ట్ టు హెూం ఆపరేటర్ అయిన డిష్ టివి ఇండియా, సృజనాత్మకమైన ఉత్పత్తుల్ని ప్రవేశపెట్టడంలో ఎప్పుడూ ముందే వుంటుంది. కార్యక్రమాల్ని డిజిటల్ మాధ్యమం ద్వారా చూడ్డం నానాటికీ పెరుగుతుండడంతో, వృత్తిపరమైన కంటెంట్ సృష్టికర్తలు, వినియోగదారులకోసం సంపూర్ణ పర్యావరణ వ్యవస్థ అయిన క్రియేటర్స్ ఎకానమీని తయారు చేసే పనిని చేపట్టింది. ఈ దిశగా వేసిన తొలి అడుగుగా, మొట్టమొదటిసారిగా - ఏప్రిల్ 2025లో కంటెంట్ ఇండియా 2025 సదస్సుని నిర్వహించింది. దాని తరవాత, అందుకు కొనసాగింపుగా, ఇప్పుడు డిష్ టివి ఒటిటి ఆవరణని ప్రజాస్వామీకరించింది. తన వాచో ఆప్‌లో "ఫ్లిక్స్" ప్రత్యేకమైన డిజిటల్ కంటెంట్ విభాగాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టింది. డిష్ టివి తీసుకున్న ఈ చర్య ఒక పెద్ద ఆవిష్కరణ అవుతుంది. ఇది కంటెంట్ పంపిణీని ప్రజాస్వామీకరించడం మాత్రమే కాక, భారతదేశంలో కంటెంట్ క్రియేటర్లందరికీ మోనిటైజేషన్ అవకాశాలని అందించడం మాత్రమేకాక, ప్రపంచ వ్యాప్తంగానూ వున్న కంటెంట్ క్రియేటర్లకు వారి కంటెంట్‌తో భారతదేశంలో ప్రయత్నించేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది. వినియోగదారులు, కంటెంట్ క్రియేటర్లు, ఇద్దరి అవసరాలకీ తగినట్టుగా వుండే వ్యూహాత్మక ఆవిష్కరణ. ఇది, సినిమాలు, వెబ్ సిరీస్ ల నుంచి షార్ట్ ఫార్మెట్ కంటెంట్ వరకూకూడా ప్రత్యేకమైన, అసలైన, అవార్డు గెలుచుకున్న, ప్రీమియం డిజిటల్ కంటెంట్‌ని, ఒకేచోట, క్యురేటెడ్ ఎన్విరాన్మెంట్‌లో డిష్ టీవీ వాచో ఆప్‌లో, ఎన్నో ప్రాంతీయ, అంతర్జాతీయ బాషల్లో అందుబాటులో వుంటుంది. ఒక కంటెంట్ టైటిల్‌కి రూ.9 చొప్పున, అలాగే చూడగలిగిన పెద్ద మొత్తాల్లోనూ కూడా ఈ కంటెంట్ వినియోగదారులకి అందుబాటులో వుంటుంది. మనోజ్ డోభల్, సిఇఒ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, డిష్ టివి ఇండియా లిమిటెడ్, మాట్లాడుతూ "ఫ్లిక్స్‌తో, ఒక ఒటిటి సర్వీస్ ఎలా వుండొచ్చన్నదాన్ని పునర్నిర్వచించడానికి మేం పెద్ద, సాహసోపేతమైన అడుగువేస్తున్నాం. పరిణామం చెందుతు వినియోగదారుల నుంచి క్యురేట్ చేసిన, ప్రత్యేకమైన, అధిక విలువకలిగిన కంటెంట్ కి పెరుగుతున్న డిమాండ్‌కి అనుగుణంగా వుండే కొత్తతరం ప్రత్యేకమైన డిజిటల్ కథాకథనాలకు ఫ్లిక్స్ ప్రాతినిధ్యం వహిస్తుంది.

విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దుండిగల్: విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లి క్రికెట్ స్టేడియంలో మేడ్చల్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి జూన్ 6 వరకు బాక్సింగ్ కోచ్ లక్ష్మణ్ సారథ్యంలో ఏర్పాటుచేసిన "బాక్సింగ్ కోచింగ్ వేసవి శిక్షణ శిబిరానికి" బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ పిల్లలు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా మానసిక దృఢత్వాన్ని, మనోధైర్యాన్ని పెంపొందించడంలో వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కుత్బుల్లాపూర్‌లో బాక్సింగ్ క్రీడకు అధ్యుడు రాములు అని వారి ఆధ్వర్యంలో వాళ్ల అబ్బాయి సుధీర్‌తో పాటు అనేక మంది శిక్షణ పొంది మంచి స్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. అదేవిధంగా ప్రతిఒక్కరు కూడా బాక్సింగ్‌ను కేవలం వేసవి శిబిరాల్లోనే కాకుండా ఒక క్రీడగా ఎంచుకొని తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ఆజాద్ ఇంజినీరింగ్‌కు 53.5 మిలియన్ డాలర్ల కాంట్రాక్టు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : జీఈ వెర్నోవాకు చెందిన స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ యూనిట్‌తో అదనపు దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ప్రెసిషన్ ఇంజనీరింగ్‌లో గ్లోబల్ లీడర్ అయిన ఆజాద్ ఇంజనీరింగ్ ప్రకటించింది. 53.5 మిలియన్ డాలర్ల విలువైన ఈ ఒప్పందం 2030 వరకు ఆరేళ్ల పాటు కొనసాగనుంది. హైదరాబాద్‌లోని తునికిబొల్లారంలో ఆజాద్ ఇంజనీరింగ్ వారి ప్రత్యేకమైన 7,600 చదరపు మీటర్ల లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ఇటీవల ప్రారంభించిన తర్వాత ఈ అదనపు ఒప్పందం కుదరడం ఒక కీలక మైలురాయి అన్నారు. ఈ సందర్భంగా ఆజాద్ ఇంజనీరింగ్ ఛైర్మన్, సీఈఓ రాకేష్ చోప్దార్ మాట్లాడుతూ, "జీఈ వెర్నోవా వారి స్టీమ్ పవర్ సర్వీసెస్ వ్యాపార యూనిట్‌తో 53.5 మిలియన్ డాలర్ల అదనపు దీర్ఘకాలిక ఒప్పందం 2013 నుంచి ఉన్న మా సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. జీఈ వెర్నోవా వారి స్టీమ్ పవర్ సర్వీసెస్ వ్యాపార యూనిట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా తునికిబొల్లారంలో ఏర్పాటు చేసిన ఆజాద్ వారి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్ సెంటర్‌లో మా లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని ఇటీవల ప్రారంభించిన సందర్భంగా కూడా ఈ ఒప్పందం జరిగిందన్నారు. అనేక ఇంజనీరింగ్ సవాళ్లను జయించామన్నారు. ఈ ఒప్పందం అధునాతన తయారీ సామర్థ్యాలు, నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులకు ఉపాధి కల్పించేందుకు మా నిబద్ధతను బలపరుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అణు, పారిశ్రామిక, థర్మల్ విద్యుత్ పరిశ్రమల కోసం అధిక ఇంజనీరింగ్ తయారుచేసే ఎయిర్ ఫాయిల్స్ అందించడానికి మాకు వీలు కల్పిస్తుందన్నారు. జీఈ వెర్నోవా వారి స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ యూనిట్‌తో ప్రయాణాన్ని కొనసాగిస్తారన్నారు. ప్రపంచవ్యాప్తంగా అవసరమైన మౌలిక సదుపాయాలకు శక్తినిచ్చే ఖచ్చితత్వం, నాణ్యత, సృజనాత్మకతను అందిస్తాము" అని తెలిపారు.

కార్ల్‌మార్క్స్ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని సీపీఐ ప్రధాన కార్యాలయం అజయ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు అనీరాజా, రావుల వెంకయ్య, రంజన్ క్షీరసాగర్, అనిల్ రజీమ్‌వాలె, కృష్ణఝా, రాయ్‌కుట్టి, వీరజ్‌దేవంగ్ తదితరులు ఘనంగా నివాళి అర్పించారు.

వక్ఫ్ సవరణ చట్టం వెనక్కి తీసుకోవాలి

రాజా డిమాండ్

కల్బుర్గి: వక్ఫ్ సవరణ చట్టం 2025ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. కర్నాటకలోని గుల్బర్గా జిల్లా కల్బుర్గిలో సోమవారం జరిగిన భారీ బహిరంగసభలో రాజా మాట్లాడారు. మోదీ సర్కారు తీసుకొచ్చిన సవరణలు రాజ్యాంగ విరుద్ధం, మైనారిటీల వ్యతిరేకమని రాజా విమర్శించారు. సమాజంలో చీలిక తీసుకురావాలన్న కుట్రతోనే వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ పార్లమెంటులో పోరాడిందని, చివరికి సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించిందని ఆయన వివరించారు. మైనారిటీలకు వ్యతిరేకంగా బీజేపీ సాగిస్తున్న కుట్ర రాజకీయాలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

దేశ సమైక్యతను కాపాడదాం

- ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ ధ్యేయం
- సామ్రాజ్యవాద శక్తులపై పోరాటమే కార్ల్ మార్క్స్‌కు అసలైన నివాళి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో కులమతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం బీజేపీకి అలవాటుగా మారిందని, చివరకు పహల్గాం ఉగ్రదాడి ఘటనను సైతం ఓటు బ్యాంక్ రాజకీయాలకు వాడుకునేందుకు దిగజారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో దేశ సమైక్యతను చాటేందుకు ప్రతిఒక్కరూ కదిలిరావాలని పిలుపు నిచ్చారు. మహా మహోపాధ్యాయుడు, సిద్ధాంత కర్త కార్ల్ మార్క్స్ 207 వ జయంతి సందర్భంగా మార్క్స్, ఏంగిల్స్, లెనిన్ విగ్రహ కమిటీ అధ్వర్యంలో సోమవారం విజయవాడ హనుమాన్ పేటలో ఉన్న మార్క్స్, ఏంగిల్స్ విగ్రహాల వద్ద సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. తొలుత విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కే రామకృష్ణ, శ్రీనివాసరావు పూల మాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల పహల్గాంలో పర్యాటకుల పై ఉగ్రవాదుల హత్యాకాండ గర్హనీయమన్నారు. కానీ ఈ దుస్సంఘటనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. సామాజిక మాధ్యమాల్లో ముస్లింలే హిందువులు మీద దాడి చేయించారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దీని వల్ల పాకిస్థాన్ లబ్ధి పొందుతుందన్నారు. ఇజ్రాయిల్-పలస్తీనా లేదా రష్యా- ఉక్రెయిన్ యుద్ధం వెనక సామ్రాజ్యవాద దేశాల కుట్రలు ఉన్నాయన్నారు ఈ నెల 9 నాటికి హిట్లర్ ఫాసిజం మీద పోరాడి విజయం సాధించి... 80 ఏళ్లు అవుతున్న సందర్భంగా కొద్ది రోజుల పాటు యుద్ధాన్ని ఆపాలని ఉక్రెయిన్‌కు రష్యా పిలుపునివ్వగా...ఉక్రెయిన్ దాన్ని పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. నేడు పెట్టుబడారి వ్యవస్థ పెరిగిపోతోందని... రోజురోజుకు పేదరికం తీవ్రమవుతోందని తెలిపారు. ఒక మనిషిని ఇంకొక మనిషి దోపిడి చేసే వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని కార్ల్ మార్క్స్ ఉధృతం చేశారని గుర్తు చేశారు. సమాజంలో అందరికీ తిండి, ఇల్లు, బట్ట లాంటి కనీస సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, దానికి అనుగుణంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారన్నారు. ప్రజల మధ్య ఆర్థిక అంతరాలను తగ్గించేందుకు మార్క్సిజం ఉపయోగపడుతుందన్నారు. కులం, మతం ప్రాతిపదికన కాకుండా శ్రమ ఆధారంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు. యావత్తు ప్రపంచాన్ని తన గుప్పెట్లో ఉంచుకునే కుట్రలు చేస్తున్న సామ్రాజ్యవాద శక్తుల మీద పోరాడి విజయం సాధించడమే కార్ల్ మార్క్స్ కు అసలైన నివాళి అని రామకృష్ణ అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైన తర్వాత ప్రపంచదేశాల ఉత్పత్తులపై పన్నులు భారీగా పెంచడం వల్ల ఆర్థిక సంక్షోభానికి దారి తీసిందన్నారు. అమెరికా గుండెల్లో చైనా సింహ స్వప్నంగా ఉందన్నారు. మార్క్స్ సిద్ధాంతాన్ని అనేక మంది అనేక రకాలుగా వ్యాఖ్యానించారని... దానికి దీటుగా మరొక సిద్ధాంతం ఎక్కడా రాలేదన్నారు.న్యూ డెమోక్రసీ పార్టీ కార్యదర్శి పోలారి, హక్కుల ఉద్యమ నాయకులు భాస్కరరావు మాట్లాడుతూ దేశంలో బీజేపీని గద్దె దించాలంటే... కమ్యూనిస్టులందరూ ఒకే వేదిక మీదకు రావాలని ఆకాంక్షించారు. తొలుత ప్రజా నాట్యమండలి నాయకులు నజీర్ ఆలపించిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డీ రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, విశాలాంధ్ర డీజీఎం మనోహర్‌నాయుడు, కార్పొరేటర్ సత్తిబాబు, వివిధ ప్రజా సంఘాల నాయకులు అక్కినేని చంద్రరావు, సీహెచ్ కోటేశ్వరరావు, నార్ల వెంకటేశ్వరరావు , సీ నరసింహారావు, వై చెంచయ్య, పీ పద్మ , తాజారావు, పీ దుర్గాంబ, లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, అరుణ్‌కుమార్, ఆర్ పిచ్చయ్య, వెంకట సుబ్బయ్య, ఖాదర్ బాషా, సయ్యద్ అఫ్సర్, నాసర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే...

ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండకూడదని, ప్రభుత్వ సేవలన్నీ పౌరులకు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కార్యకలాపాలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ గవర్నెన్స్ గురించి ప్రజల్లో అవగాహన పెంచేలా విస్తృతంగా దీని గురించి ప్రజల్లోకి తీసుకెళ్లా లన్నారు. ప్రభుత్వం అన్ని సేవలు కూడా ప్రజలు ఎలాంటి అవరో ధాలు లేకుండా ఆన్‌లైన్‌లో పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ కూడా ఈ దిశగా తమ కార్యకలాపాలను మెరుగుపరచుకోవాలని, డేటా లేక్ పనులు వేగవంతం చేయాలని, డ్రోన్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు కల్పించాలని సూచించారు. వర్క్‌ఫ్రం హెూం చేయడానికి అందుబాటులో ఉన్న మానవ వనరులకు నైపుణ శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 273 రకాల సేవలు అందిస్తున్నామని, జూన్ 12వ తేదీలోపు 370 నుంచి 380 సేవలను అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎం కార్యదర్శులు ముద్దాడ రవిచంద్ర, పీఎస్ ప్రద్యుమ్న, సమాచారశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రెవెన్యూ శాఖ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్, డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలన తిప్పికొడదాం

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-యలమంచిలి (అనకాపల్లి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం యలమంచిలి పట్టణంలో సీపీఐ అనకాపల్లి జిల్లా రెండో మహాసభను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా గుర్రప్ప కల్యాణ మండపం వరకు సీపీఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుండా దూకుడు స్వభావంతో ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, బీహార్‌లో నితీశ్ కుమార్ సహాయంతో గట్టెక్కినప్పటికీ బీజేపీలో ఎటువంటి మార్పు రాలేదని మండిపడ్డారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని, రైతు ఆత్మహత్యలు లేకుండా చేస్తామని ఎన్నో వాగ్దానాలు ఇచ్చి నేడు వాటిని అమలు చేయకుండా గాలికి వదిలేసిందని తెలిపారు. రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేస్తానన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. దున్నేవాడిదే భూమి అన్న నినాదానికి వ్యతిరేకంగా ఈనాడు కర్షకులకు న్యాయం జరగడం లేదన్నారు. పేదలకు సొంతింటి కల ఏళ్లు గడుస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చలేదని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత ప్రాతిపదికన పాలన సాగిస్తోందని, పహల్గాం ఉగ్ర దాడిలో హిందువులతో పాటు ముస్లింలు కూడా మృతి చెందారని అన్నారు. కాగా, యలమంచిలి, పాయకరావు పేట నియోజకవర్గాల పరిధిలో అనేక కంపెనీలు వచ్చినప్పటికీ స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, జిల్లా సహాయక కార్యదర్శి ఎం.రామనాయుడు, ఆర్.దొరబాబు, సీపీఐ కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు, ఆర్.జగ్గారావు, సీహెచ్ క్రాంతి, బి.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురికి రాజకీయాలు చేయొద్దు

ఉగ్ర దాడిపై పశ్చిమ బెంగాల్ సీఎం

కోల్‌కతా: పహల్గాం ఉగ్ర దాడి విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటుగా స్పందించారు. మత రాజకీయాలు చేయడం మానుకుని, దేశ సరిహద్దులను జాగ్రత్తగా కాపాడుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. మనం దేశాన్ని ప్రేమిస్తున్నామని, ఎలాంటి విపత్తు జరగకుండా దేశాన్ని కాపాడుకోవాలని ఆమె సలహా ఇచ్చారు. పహల్గాం ఉగ్ర దాడిలో తమ ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్నవారికి న్యాయం చేయాలని మమత డిమాండ్ చేశారు. తాను మురికి రాజకీయాలను ఏమాత్రం సహించబోనని హెచ్చరించారు. తాను 10 నుంచి 12 మంది ప్రధాన మంత్రులతో కలిసి పనిచేశానని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రధాని మత కల్లోలాలు సృష్టించడంపై శ్రద్ధ పెట్టడం మానుకుని, సరిహద్దులపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. తాను ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయడం లేదని, దేశంలో యాక్టివ్ ప్రధాని మంత్రి ఎవరో బీజేపీ నేతలు చెబుతున్నారని, ఆయన ప్రధాని పీఠంపై కూర్చున్నా దేశ ప్రజలను విడదీయలేరని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి సీఎం మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేశారు.

సంసెర్‌గంజ్‌లో మమత పర్యటన

దాదాపు నెల రోజుల క్రితం కోల్‌కతాకు 287 కి.మీ ఉత్తరాన పట్టణాన్ని కుదిపేసిన మత హింసలో భర్తలను కోల్పోయిన సంసెర్‌గంజ్‌కు చెందిన దాస్ కుటుంబానికి చెందిన ఇద్దరు వితంతువులు లేకపోవడంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది మరొక కుట్రగా కనిపిస్తోందని అన్నారు. 'నేను ఇద్దరు మహిళలను కలవడానికి ఇక్కడికి వచ్చాను. మేము హామీ ఇచ్చిన రూ.10 లక్షల చెక్కును అందజేయా లనుకున్నాను. కానీ వారు ఇక్కడ లేరు. ఎందుకు? ఏదో వంట చేస్తున్నారా' అని ముఖ్యమంత్రి బెర్హంపూర్‌లో మీడియాతో క్లుప్తంగా మాట్లాడుతూ అన్నారు. సంసెర్‌గంజ్‌లో భాగమైన ముర్షిదాబాద్‌లోని అల్లర్లతో అతలాకుతలమైన ప్రాంతాల పర్యటనలో మమత మొదటిరోజు పర్యటించారు. ఏప్రిల్ 8న వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు మతపరమైన అల్లర్లకు దారితీశాయి. ఇది హర్‌గోవింద్ దాస్, అతని కుమారుడు చందన్ అనే తండ్రీకొడుకుల సహా ముగ్గురు ప్రాణాలను బలిగొంది. వేలాది మంది తమ ఇళ్లను వదిలి వెళ్లవలసి వచ్చింది. 'నేను వారిని కలవడానికి వచ్చాను. ఇక్కడ నా తప్పు లేదు' అని మమత సోమవారం మధ్యాహ్నం అన్నారు. 'జాతీయ మానవ హక్కుల కమిషన్ మరుసటి రోజు ఎలా చేరుకోగలిగింది? రెండేళ్లుగా మండుతున్న మణిపూర్‌ను సందర్శించడానికి వారికి సమయం లేదు. చాలా మంది ప్రాణాలు కోల్పోయిన బీహార్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా లేదా దిల్లీని సందర్శించలేదు. బెంగాల్‌కు వారు మరుసటి రోజే చేరుకున్నారు' అని మమత అన్నారు. మతపరమైన వివక్షత పరిపాలనా పదవుల్లో ఉన్నవారికి తగదని మమత కేంద్రంలోని పాలక వర్గాన్ని హెచ్చరించారు. గవర్నర్ నివేదిక గురించి లేదా రాష్ట్రంలో ఆర్టికల్ 356 రాష్ట్రపతి పాలన) అమలు గురించి ఆయన ప్రస్తావించిన దాని గురించి తనకు తెలియదని ముఖ్యమంత్రి అన్నారు.

ముందు దాడి చేయండి

పాక్ విపక్ష నేత చిందులు

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడిపై పాక్ జాతీయ అసెంబ్లీలో వాడివేడి చర్చ జరిగింది. ఈ చర్చలో విపక్ష నేత, పీటీఐ మద్దతుతో గెలిచిన ఎంపీ ఒమర్ అయూబ్ భారత్‌పై విషం కక్కారు. యుద్ధోన్మాదంతో ఊగిపోయారు. పహల్గాం దాడిపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు న్యూఢిల్లీకి దాసోహం అన్నట్టుగా ఉన్నాయని ఆక్షేపణ తెలిపారు. 'మనం తర్వాత ఆలోచిద్దాం, ముందు దాడి చేయండి. అవసరమైతే భారత్ విమానాలు కూల్చేయండి' అని అయూబ్ సూచించారు. షెహబాజ్ షరీఫ్ మోకరిల్లుతున్నారనీ, మోదీకి గట్టి సమాధానం ఇచ్చి తీరాలని పేర్కొన్నారు. పహల్గాం దాడిలో పాక్ ప్రమేయం ఎంతమాత్రం లేదని అయూబ్ బుకాయించారు. 'పహల్గాం మనకు 450 కిలోమీటర్ల దూరంలో ఉంది. దాడితో పాకిస్థాన్‌కు ఏం సంబంధం? దాడిని మనం ఖండిస్తున్నాం. పాకిస్థాన్ ఎన్నడూ అలాంటి చర్యలకు పాల్పడదు' అని చెప్పుకొచ్చారు. షెహజాబ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలను మరోసారి ఖండిస్తూ... పాకిస్థాన్‌ను ప్రేమించే వ్యక్తిగా తానైతే ఎన్నడూ అలాంటి ప్రసంగం చేయనని, మన (పాక్) ప్రమేయం లేనప్పుడు దర్యాప్తునకు మనం ఎందుకు అంగీకరించాలని ప్రశ్నించారు. కాగా, ఉద్రిక్తతల వేళ అందరూ ఐక్యతా పిలుపునివ్వాలని, పారామిలటరీ రోజువారీ కార్యక్రమాలు నిలిపివేసి... జాతికి ఐక్యతా సందేశం ఇవ్వాలని న్యాయ శాఖ మంత్రి అజామ్ నజీర్ తరర్ సూచించారు. యావద్దేశం ఐక్యంగా ఉండటమే తక్షణావసరమని, అందరూ ఒకేమాటపై ఉండి దేశం కోసం నిలబడాలని కోరారు.

నాలుగు రోజుల్లో పాక్ కథ ఖతం: రాందేవ్

ఇంటర్నెట్ డెస్క్: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ యోగా గురు బాబా రాందేవ్ సోమవారం కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే అంతర్గత ఘర్షణలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ తనంతట తానుగా విచ్ఛిన్నమవుతుందన్నారు. బలూచ్ ప్రజలు స్వాతంత్ర్యం కోసం డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. పాక్‌కు పోరాడే శక్తి లేదని, భారత్‌తో యుద్ధం జరిగితే ఆ దేశం నాలుగు రోజులు కూడా నిలవలేదని చెప్పారు.

రెడ్‌క్రాస్ అవార్డుకు కలెక్టర్ నాగరాణి

మానవీయ సేవలలో అత్యున్నత పనితీరుకు గుర్తింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మానవీయ సేవల్లో మెరుగైన పనితీరుకు గుర్తింపుగా పశ్చిమ గోదావరి కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక అయ్యారు. ఇటీవల ముంచెత్తిన వరదలలో ప్రజానీకాన్ని ఆదుకునే ప్రయత్నంలో నాగరాణి చేసిన కృషి గుర్తింపుగా 2023-24, 2024-25 సంవత్సరాలకు గాను రెడ్ క్రాస్ ఈ అవార్డును ప్రకటించింది. కనీస రవాణా సదుపాయాలు సైతం అందుబాటులోకి రాని విపత్కర తుపాను పరిస్థితుల్లో ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి ద్విచక్ర వాహనంపై లోతట్టు ప్రాంతాలను సందర్శించి బాధితులకు బాసటగా నిలిచారు. బుడమేరు వరద ముంపు బాధితులకు అండగా దాదాపు వారం రోజుల పాటు విజయవాడకు పెద్ద ఎత్తున ఆహార పదార్థాలను సరఫరా చేయించారు. పశ్చిమ గోదావరి జిల్లా నుండి వరద భాదితుల సహాయార్థం పెద్దయెత్తున నిధులు సమకూర్చి స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకుకి అందించి మరికొందరికి ప్రేరణగా నిలిచారు. నాగరాణి అందించిన సేవలకు గాను ముఖ్యమంత్రి అభినందనలు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ అధ్యక్షుడు మాననీయ ఎస్.అబ్దుల్ నజీర్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర రెడ్ క్రాస్ సహజ విపత్తుల సమయంలో సహాయక చర్యలు, రక్తదాన శిబిరాలు, ఫస్ట్‌ఎయిడ్ శిక్షణా కార్యక్రమాలు వంటి అనేక మానవతా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందంజలో ఉంది.

అడ్వాన్స్‌డ్ కోర్సులపై ఒరాకిల్‌తో అవగాహన

మూడేళ్లలో 4లక్షలమందికి ఉపాధే లక్ష్యంగా శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి చెందుతున్న ఐటీ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలలో యువతకు శిక్షణఇచ్చి, వర్క్ ఫోర్స్ ను సిద్ధం చేయడానికి ప్రఖ్యాత సంస్థ ఒరాకిల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో సోమవారం ఒరాకిల్, ఏపీఎస్ఎస్డీసి ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేశారు. దీనిద్వారా ఎంపిక చేసిన యువతకు ఒరాకిల్ యూనివర్సిటీ లెర్నింగ్ సబ్ స్క్రిప్షన్ కంటెంట్ ఉచితంగా లభిస్తుంది. మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల యువతలో ఒరాకిల్ క్లౌడ్ నైపుణ్యాల కోసం చేయూత అందించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. తొలిఏడాది లక్షమందికి, రెండు, మూడు సంవత్సరాల్లో లక్షన్నర మందికి చొప్పున మొత్తం 4లక్షలమందికి ఒరాకిల్ మై లెర్న్ డిజిటల్ ప్లాట్ ఫాం ద్వారా శిక్షణ ఇస్తారు. ఒరాకిల్ క్లౌడ్ ఎసెన్షియల్స్, ఓసిఐ ఫౌండేషన్స్, ఎఐ ఫౌండేషన్స్, డేటా సైన్స్, క్లౌడ్ సెక్యూరిటీ క్యూరేటెడ్ లెర్నింగ్ పాత్స్ పై శిక్షణా కార్యక్రమాలు ఉంటాయి. ఒరాకిల్ ఇన్ హౌస్ బృందం అభివృద్ధి చేసిన ఈ కోర్సులను నేర్చుకోవడానికి అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ సీఈవో గణేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ దినేష్ కుమార్, ఒరాకిల్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శైలేంద్రకుమార్, సీనియర్ సేల్స్ డైరక్టర్ దేబప్రియ నందన్, వైస్ ప్రెసిడెంట్ (జపాక్ స్కిల్ డెవలప్ మెంట్) తపస్ రాయ్, టెరిటరీ సేల్స్ మేనేజర్ షకీల్ అహమ్మద్ మొహమ్మద్, ప్రిన్సిపాల్ క్లౌడ్ ఆర్కిటెక్ట్ వెంకటశివ నక్కా, కంట్రీ హెడ్ అశ్లేష ఖండేపార్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు 180 ప్రసూతి సెలవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివాహిత మహిళలకు ఇచ్చే ప్రసూతి సెలవులను 120 రోజుల నుంచి 180 రోజులకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇద్దరు పిల్లలకు మాత్రమే సెలవులు వర్తింపు అనే నిబంధనను ప్రభుత్వం తొలగించింది. సీఎం చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా ఉద్యోగుల సమస్యలపై ప్రధాన దృష్టి పెడతామని హామీ ఇచ్చిన విషయం విదితమే. ఈ హామీలో భాగంగా ఇప్పటికే అనేక నిర్ణయాలు తీసుకోగా... తాజాగా ప్రసూతి సెలవులను 180 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్న తరహాగానే 180 రోజులు ఇవ్వనున్నారు. ఇక నుంచి ఎంత మంది పిల్లలను కనినప్పటికీ, ప్రసూతి సెలవులు యథాతథంగా వర్తిస్తాయి. మహిళా ఉద్యోగుల వృత్తి, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసేందుకుగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

భద్రతా సిబ్బందితో బీజేపీ నేత రీల్స్

ఉద్రిక్తతల వేళ ఇదేం పని: కాంగ్రెస్

కశ్మీర్: జమ్మూకశ్మీర్ బీజేపీ మాజీ అధ్యక్షుడు రవీందర్ రైనా కశ్మీర్‌లో భద్రతా సిబ్బందితో చేసిన రీల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆయనపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. పహల్గాం ఉగ్రదాడితో దేశమంతా బాధలో ఉంటే బీజేపీ నేత రీల్స్ చేస్తూ...ఎంజాయ్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనాథే మండిపడ్డారు. పాక్‌తో ఉద్రిక్తతల వేళ భద్రతా సిబ్బందిని తనతో తిప్పుకుంటూ... రీల్స్ చేస్తూ వారిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. తమ నేతలు ఇటువంటి బాధ్యతారహితమైన చేష్టలు చేస్తుంటే ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా మౌనంగా ఉంటారా అని ప్రశ్నించారు. భద్రతా బలగాలను బీజేపీ నేతలు తమ చుట్టూ తిప్పుకుంటుంటే వారు దేశసరిహద్దులను, కశ్మీర్‌ను ఎలా రక్షించగలుగుతారని శ్రీనాథే దుయ్యబట్టారు. 'తమ పార్టీ నేతలకు ఐదుమందికి పైగా భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసిన బీజేపీ... పర్యాటకుల భద్రత కోసం పహల్గాంలో ఒక్క సైనికుడిని కూడా ఏర్పాటు చేయలేకపోయింది' అని శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది బీజేపీపై మండిపడ్డారు.

పహల్గాం మృతుడి భార్యపై ట్రోలింగ్ సరికాదు

జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి మృతుడి భార్యను నెట్టింట్లో ట్రోల్ చేస్తున్నారు. దీనిపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఆమె సైద్ధాంతిక వ్యక్తీకరణను తప్పుపడుతూ ట్రోల్ చేయడం సరికాదని ఖండించింది. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి ఘటనలో మృతి చెందినవారిలో నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఒక వర్గం వారిని టార్గెట్ చేసేలా వ్యాఖ్యలు చేయొద్దంటూ ఆయన సతీమణి హిమాన్షి విజ్ఞప్తి చేశారు. ఇది కొందరు నెటిజన్లకు రుచించలేదు. దాంతో ఆమెను విమర్శిస్తూ ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. ఆమెను ఉద్దేశించి కామెంట్లు చేయడం ఏమాత్రం తగదని, దీనిపై కేంద్రం స్పందించాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ తరుణంలోనే మహిళా కమిషన్ నుంచి స్పందన వచ్చింది. 'పహల్గాం ఉగ్రదాడిలో ఎన్నో కుటుంబాలకు తీరనిలోటు ఏర్పడింది. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్‌ను కూడా మతం పేరు అడిగి, ప్రాణాలు తీశారు. ఉగ్రఘటనపై దేశం మొత్తం ఆగ్రహంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయన భార్య హిమాన్షి నర్వాల్ వ్యక్తంచేసిన అభిప్రాయంపై సోషల్ మీడియాలో వస్తోన్న విమర్శలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఆమె వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండించదగినది. ఏదైనా కామెంట్ చేసేటప్పుడు మర్యాదగా, రాజ్యాంగ సరిహద్దులకు లోబడి వ్యవహరించాలి. జాతీయ కమిషన్ ప్రతి మహిళ గౌరవాన్ని కాపాడే దిశగా చర్యలు తీసుకునేందుకు కట్టుబడి ఉంది' అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. హర్యానాకు చెందిన వినయ్- హిమాన్షి వివాహం ఏప్రిల్ 16న జరిగింది. 19న విందు నిర్వహించారు. అనంతరం భార్యను తీసుకొని జమ్మూకశ్మీర్‌కు హనీమూన్‌కు వెళ్లారు. తొలుత హనీమూన్ కోసం యూరప్ వెళ్లాలని నిర్ణయించుకున్న ఈ జంట... తమ వీసాలు రిజెక్ట్ కావడంతో జమ్మూకశ్మీర్‌కు వచ్చింది. ఉగ్రదాడితో ఆమె కలలన్నీ కల్లలయ్యాయి. పెళ్లై వారం కూడా గడవక ముందే... తన కళ్ల ముందే జీవచ్ఛవంలా మారిన భర్తను చూసి హతాశురాలైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.